మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## వాహనాలకు సైరన్లు బిగిస్తే కఠిన చర్యలు తప్పవు
### సిపి అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
జిల్లాలో మైనర్, త్రిబుల్ డ్రైవింగ్, నిబంధనలకు విరుద్ధంగా పోలీసు సైరన్‌లు, అధిక శబ్దాలు వచ్చేలా వాహనాలకు సైలెన్సర్లు బిగించిన వావానాలపై ప్రత్యేక శ్రద్దతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని సీపీ డా॥అనురాధ తెలిపారు. మంగళవారం అమె మాట్లాడుతూ నిబంధనలకు విరుద్దంగా వాహనాలకు సైరన్లు బిగించిన 30 వాహనాలపై కేసులు నమోదు చేసి సీజ్ చేసినట్లు తెలిపారు. త్రిబుల్ రైడింగ్ చేసిన వారిపై 305 మందికి జరిమానా విధించి కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. మైనర్ డ్రైవింగ్ చేసి 509 మందిపై కేసులు నమోదు చేసి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చినట్లు వివరించారు. జిల్లాలో నిబంధనలకు విరుద్దంగా వాహనాలకు సైరన్లు బిగిస్తే వాహనాలు సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్దంగా వాహనాలు నడిపే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్, రోడ్డు నిబంధలను పాటించాలన్నారు. ప్రజల, వాహనదారుల రక్షణే ప్రధాన ధ్యేయంగా ట్రాఫిక్ పోలీసులు పని చేస్తున్నారని తెలిపారు.

## జనుము, జీలుగ విత్తనాల కోసం రైతుల ధర్నా


జీలుగ విత్తనాలకోసం జోగిపేట వ్యవసాశాఖ కార్యాలయం ముందు లైన్లో ఉంచిన రైతుల పట్టాపాస్‌బుక్కులు

**జోగిపేట, మే 21, ప్రభాతవార్త:** జనుము, జీలుగ విత్తనాలకోసం రైతులు ధర్నాకు దిగారు. జోగిపేటలో పచ్చిరొట్టె ఎరువులు మంగళవారం నుంచి రైతులకు అందుబాటులో ఉంటాయని వ్యవసాయ అధికారులు తెలియచేసిన సందర్భంగా వాటికోసం మంగళవారంనాడు రైతులు భారీ సంఖ్యలో జోగిపేటకు తరలివచ్చారు. అయితే జోగిపేటకు కేటాయించిన దానిలో కొంతమేర మాత్రమే విత్తనాలు సరఫరా కావటంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విత్తనాలకోసం రైతుల వ్యవసాయ కార్యాలయం వద్ద పట్టాపాస్ బక్కులు లైన్లో ఉంచి వేచి ఉన్నారు. అయినప్పటికీ అక్కడికి వచ్చినవారికి తగినంత పరిమాణంలో విత్తనాలు సరఫరా కాకపోవటంతో కొందరికి మాత్రమే ఆ విత్తనాలు అందాయి. దీంతో మిగతా రైతులు వాటికోసం ధర్నా చేశారు. అయితే వ్యవసాయ శాఖ ఏడిఏ అరుణ మాట్లాడుతూ తమకు కేటయించిన విత్తనాలు మొత్త ఒకేసారి రావని, రోజుకు కొంత పరిమాణంలోనే వస్తాయని, ఇలా మూడు నాఉల రోజుల్లో అందరికీ అంద చేస్తామని ఆమె తెలిపారు.

## జాతీయ రహదారి పనుల్లో అధికారుల నిర్లక్ష్యం...!

**-హుస్నాబాద్ మురుగు కాలువల మట్టి పందిల్ల వాగులో డంపింగ్**
**-ముందస్తు వర్షాలు కురిస్తే నీరు బయటకు వెళ్లేనా...!?**

**హుస్నాబాద్, మే20, ప్రభాతవార్త**
ఎల్కతుర్తి నుండి రామాయంపేట వరకు జరుగుతున్న 765 డిజి జాతీయ రహదారి పనుల్లో అధికారుల నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తోంది. వివరాల్లోకి వెళ్తే 2022 సెప్టెంబరు నెలలో ప్రారంభమైన ఈ పనుల్లో కాస్త పెద్దదైన పందిల్ల వాగు పనులు ఈ మధ్యనే ప్రారంభమయ్యాయి. ఇక్కడి వరకు బాగానే ఉన్నా జరుగుతున్న పనుల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అసలే ఆలస్యంగా ప్రారంభమైన పందిల్ల బ్రిడ్జి పనులు వర్షాకాలంలోపు పూర్తయితాయా కావా అనే సందిగ్ధంలో ప్రజలు ఉంటే.. గత రెండు రోజుల క్రితం హుస్నాబాద్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గుత్తేదారులు నిబందనల ప్రకారం మార్కింగ్ పెట్టిన వరకు మట్టిని తీస్తూ తరలిస్తున్న మట్టిని పందిల్ల వాగులోనే పెద్ద పెద్ద గుట్టల్లా డంపింగ్ చేస్తున్నారు. గతంలో ఈ బ్రిడ్జి చిన్నదిగా ఉండడంతో పాత బ్రిడ్జిపై నుండి ఎల్లమ్మ చెరువు నుండి వరద ఉద్రిక్తంగా ప్రవహించి వాహనాలు రాకపోకలు నిలిచిపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇదిలా ఉంటే జాతీయ రహదారి పనులలో భాగంగా పందిల్లలో నిర్మిస్తున్న బ్రిడ్జి అక్కడ నుండి ప్రవహిస్తున్న నీరు బయటకు వెళ్లేందుకు చేస్తుంటే బ్రిడ్జి పనుల సందర్భంగా


పందిల్ల వాగులో మట్టిని లారీ ద్వార డంప్ చేస్తున్న దృశ్యం

వాహనాలు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పక్క రహదారి పక్కనే అంటే వాగులోనే పోస్తుండడంతో వర్షాకాలం సమీపిస్తున్న వేళ మట్టి వాగులో పోస్తే అక్కడి నుండి ప్రవహించే నీరు బయటకు ఎలా వెళ్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

**-మట్టి వాహనాలను అడ్డుకున్న గ్రామస్థులు...**
హుస్నాబాద్‌లో జాతీయ రహదారి పనులు ప్రారంభమైన సందర్భంగా జరుగుతున్న పనుల నిమిత్తం ఇక్కడి మట్టిని తీసివేయాల్సి వస్తోంది. అయితే ఇక్కడి నుండి తరలిస్తున్న మట్టిని కాంట్రాక్టర్ అనాలోచిత నిర్ణయం వల్ల పందిల్ల వాగులో పోస్తుండడంతో మంగళవారం రోజున కొంత మంది వాహనదారులు అడ్డుకున్నారు. అక్కడ మట్టిని పోస్తున్న లారిని అడ్డుకుని మట్టి ఇక్కడ పోస్తే వాగులో నుండి నీరు బయటకు ఎలా వెళ్తుందని నిలదీయడంతో అక్కడ మట్టిని డ్రైవర్ ముందుకు తీసుకుని వెళ్లిపోయారు. ఈ విషయంలో సంబందిత అధికారులు చొరవ తీసుకుని వాగులో మట్టిని పోయనియకుండా చూసుకోవడంతో పాటు ఇదివరకే అక్కడ నిల్వ చేసిన మట్టిని కూడా తొలగించాలని గ్రామస్థులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

**ఇబ్బందులు లేకుండా చూసుకుంటాం...**
**-జాతీయ రహదారి వర్క్ఇంచార్జీ సలీం...**
జరుగుతున్న జాతీయ రహాదాది పనుల్లో ప్రజలు వాహనదారులు ఇబ్బందులు పడకుండా చూస్తామని జాతీయ రహదారి వర్క్ ఇంచార్జి సలీం అన్నారు. మంగళవారం లారీని గ్రామస్థులు అడ్డుకోవడంతో అటుగా వస్తున్న ప్రభాతవార్త ప్రతినిధి అక్కడే ఆగి సమస్యను తెలుసుకున్న నేపథ్యంలో ప్రజలు వాగులో పోసిన మట్టిని తొలగించడంతో పాటు ఇదివరకే అక్కడ పోసిన మట్టిని తీసివేయాలని డిమాండ్ చేయగా వర్క్ ఇంచార్జీ హైదరాబాద్‌లో ఉన్నానని వచ్చిన వెంటనే సమస్య లేకుండా పరిష్కరిస్తానని చెప్పారు. జాతీయ రహదారి విషయంలో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటామన్నారు. అయితే జాతీయ రహదారి డిఈఈ దృష్టికి తీసుకెళ్లేందుకు ఫోన్ ప్రయత్నించగా డిఈఈ అందుబాటులోకి రాలేదు.

## ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి

**-అమ్మ ఆదర్శ కార్యక్రమం పనుల్లో నిర్లక్ష్యంపై కలెక్టర్ అసంతృప్తి**
**-నిర్లక్షం వహించిన హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు**

**జోగిపేట, మే21, ప్రభాతవార్త:** అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం పనుల విషయంలో నిర్లక్ష్యం వహించిన హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాల్సిందిగి జిల్లా విద్యాధికారిని కలెక్టర్ క్రాంతి వల్లూరి ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. మంగలారంనాడు జోగిపేటలోని అందోలులోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, మండల పరిధిలోని అన్నాసాగర్ ప్రాథమికోన్నతపాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పనుల విషయంలో ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద పాఠశాలలో విదార్థులకు సంఖ్యకు తగ్గట్లుగా మౌళిక సదుపాయాలు కల్పించాలని, వీటి నిర్మాణాలను పాఠశా ప్రధానోపాధ్యాయుల దగ్గరుండి చూసుకోవాలన్నారు. విద్యార్థులకు తగ్గట్లుగా టాయిలెట్లు ఉండాలన్నారు. పాఠశాల పునఃప్రారంభానికిఆమ్మ ఆదర్శ మిటీల ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను తప్పని సరిగా పూర్తిచేసి నివేదిక సమర్పించాలని విద్యాశాఖ అధికారులను, ఈఈ పిఆర్ ఇంజీనర్లను ఆదేశించారు. పాఠశాలను తనిఖీ చేసిన సమయంలో ఉపాధ్యాయులు లేకపోవడంతో కలెక్టర్ తీవ్ర అసహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా విద్యాధికారిని ఆదేశించారు.

## ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వద్దు

**-అకాలవర్షాల నేపథ్యంలో కొనుగోలు వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి**


అందోలు పిఏసిఎస్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి

**జోగిపేట, మే21,. ప్రభాతవార్త:**
రైతులు పండించిన ధాన్యం కొనుగోలులో ఏలాంటి జాప్యం చేయొద్దని, అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి అన్నారు. మంగళవారంనాడు మండల పరిధిలోని మన్సా న్‌పల్లి, కన్‌సాన్‌పల్లి గ్రామాలలోని ధానక్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు కొనుగోలు కేంద్రాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలు త్వరాగా ప్రారంభించాలని, ప్రతినిథ్యం ఐదు లారీలకు తగ్గకుండా కొనుగోలు కేంద్రాలకు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు పంపాలని, మిల్లుల్లో ధాన్యం నిలువ చేసేందుకు అవసరమైన స్థలాన్ని అందుబాటులో ఉంచుకోవాలని, లారీల్లో ధాన్యాన్ని వెంటన్ అన్‌లోడ్ చేయించుకోవాలన్నారు. కెపాసిటి మేరకు మిల్లులకు ధాన్యాన్ని వెంటనే తరలించాలని సూచించారు. రైతులకు ధాన్యం అమ్ముకునే విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. గన్నీ బస్తాలకు కొరతలేకుండా చూసుకోవాలని, ఒకవేళ కొరత ఉంటే అధికారుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె వెంబడి సివిల్ సప్లై జిల్లా మేనేజర్ కొండల్‌రావు, డిసిఎస్‌వో వనజాత, మెప్మా పిడి గీత, ఆర్డీవో పాండు తదితరులు ఉన్నారు.

## ఎరువులు,విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం

**-జిల్లా వ్యవసాయాధికారి గోవింద్**

**రామాయంపేట, మే21, ప్రభాతవార్త:**
ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అన్నధాతలకు అవసరమయ్యే ఎరువులు విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ అన్నారు. మంగళవారం నాడు రామాయంపేట పట్టణంలో రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ హాజరయ్యారు. రామాయంపేట మండల పరిధిలో ఉన్న పలు విత్తన, ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ వచ్చే వర్షాకాలంలో వాతావరణ శాఖ అంచనాల ప్రకారం సమృద్ధిగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున పంట విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందన్నారు. అందుకు అనుగుణంగా రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచుతామని ఆయన హామి ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 3,73,509 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉందని అంచనా వేయడం జరిగిందన్నారు. విటికి సరిపడా విత్తనాలు, ఎరువులను ప్రాథమిక సహకార సంఘాలు, అగ్రో రైతు సేవ కేంద్రాలు, ప్రవేటు డీలర్ల ద్వారా అందుబాటులో ఉంచడం జరుగుతుందని పేర్కొన్నారు. నేల సంరక్షణ పద్దతుల్ని పెంపొందించడానికి సబ్సిడీపై జీలుగు, జనుము విత్తనాలను జిల్లా వ్యాప్తంగా అందుబాటులో ఉంచడం జరిగిందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడే విత్తనాలు వేసుకోవాలని లేనిచో భూమి నుండి అధిక ఉష్ణోగ్రత ప్రభావం వల్ల విత్తన మొలక శాతంపై తీవ్ర ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున, భూమిలో కనీస తేమ ఉన్నప్పుడే విత్తనాలను


రామాయంపేటలో ఎరువుల దుకానాన్ని తనికి చేసిన జిల్లా వ్యవసాయాధికారి గోవింద్

విత్తుకోవాలని సూచించారు. అదే విధంగా విత్తన దశ నుండి పంటకోత వరకు వివిధ అంశాలపై వ్యవసాయ, విశ్వవిద్యాలయ నిపుణులచే ప్రతి మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం ద్వారా వీడియో కాన్ఫరేన్స్ విధానం ద్వారా రైతులకు వ్యవసాయ మరియు అనుబంధ రంగాలపై ఆదునిక సాంకేతికత అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని రైతులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఎరువుల కొనుగోలులో ఆదికృత డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని వ్యవసాయ సంబంధ అంశాలపై తప్పనిసరిగా వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు వసంత సుగుణ, మండల వ్యవసాయ అధికారులు రాజ్ నారాయణ, సతీష్, హరి ప్రసాద్, బాల్‌రెడ్డి మరియు డివిజన్ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గోన్నారు.

## రాయితీపై జనుము, జీలుగ విత్తనాలు

**జగదేవ్‌పూర్ మే 21, ప్రభాతవార్త :**
రాయితీపై మండలంలోని రైతులకు జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి యు.వసంతరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులందరూ తొలకరి వర్షాలకు జనుము, జీలుగ విత్తనాలను చల్లుకున్నట్ల యితే పంటలకు సహజసిద్ధంగా నత్రజనితో పాటు బలాన్ని అందజేస్తుందని, అలాంటి విత్తనాలు ప్రభుత్వం ద్వారా రైతులకు రాయితీపై 30 కేజీల జనుము బస్తా రూ.1116, జీలుగ 40 కేజీల బస్తాకు రూ.1448 చెల్లించి మండల కేంద్రంలోని డిసిఎంఎస్ రైతు సేవా కేంద్రంలో పొందవచ్చని అన్నారు. మండలంలోని రైతులు ఈ వర్షాకాలంలో పత్తి 17వేల ఎకరాలు, వరి 12450 ఎకరాలు, మొక్కజొన్న 300 ఎకరాలు, కంది 100 ఎకరాలలో సాగు చేయనున్నట్లు అంచనా వేశామని అన్నారు. దీనికి సంబంధించిన పత్తి, వరి విత్తనాలు మార్కెట్‌లో సిద్ధంగా ఉన్నాయని, రైతులు ఒక్క హైబ్రిడ్ రకంపై ఆధారపడకుండా మార్కెట్‌లో ఉన్న వివిధ రకాల హైబ్రిడ్ పత్తి విత్తనాలను సాగు చేయాలని సూచించారు. అన్ని రకాల పత్తి విత్తనాలు సరైన యాజమాన్య పద్దతిలో సా గు చేస్తే ఒకేలా దిగుబడి ఇస్తాయని, అందువల్ల రైతులు అందరూ ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఇ ప్పటి వరకు మండలంలో వివిధ రకాల కంపెనీ పత్తి విత్తనాలు 27వేల ప్యాకెట్లు, వరి 450 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## గోవా వెళ్లాల్సింది...రాత్రంతా పోలీసు ఠాణా రోడ్డుపైనే

**-ఓం శ్రీ ట్రావెల్స్ బస్సు ఆపరేటర్ల నిర్వాకం**
**-ట్రావెల్స్‌పై చర్యలు తీసుకోవాలని ఠాణాలో ఫిర్యాదు**


గోవా వెళ్లాల్సిన ప్రయాణీకులు పోలీసు ఠాణా వద్ద పడిగాపులు కాస్తున్న దృశ్యం

**రామచంద్రాపురం, మే 21, ప్రభాతవార్త:**
సరదాగా గడిపేందుకు గోవా వెళ్లాల్సిన ప్రయాణీకులు రాత్రంగా పోలీసు ఠాణాలో గడపాల్సి వచ్చింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గోవాకు వెళ్లాల్సిన ప్రయాణీకులు క్షం ట్రావెల్స్‌లో తమ సీట్లను రిజర్వు చేసుకున్నారు. ప్రయాణీకులందరూ ఒకే దగ్గరకు రావాలని ట్రావెల్స్ నిర్వాహకులు ప్రయాణీకులను పరుగులు పెట్టించారు. హైద్రాబాద్‌లోని ఎల్‌బి నగర్ నుంచి ప్రయాణీకులను గోవాకు వెళ్లేందుకు పికప్ చేసుకోవాల్సి ఉండగా ప్రయాణీకులను మియాపూర్ రావాలని మెసేజ్‌లో పురమాయించారు. బస్సులో సౌకర్యాలు సరిగ్గా లేవని అడిగినందుకు బస్సు డ్రైవర్ ప్రయాణీకుల పట్ల దురుసుగా ప్రవర్తించడమే కాకుండా సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పట్టణం అశోక్ నగర్ వద్ద రోడ్డుపై బస్సును ఆపేసి డ్రైవర్ అక్కడి నుంచి ప్రయాణీకులను వదిలి వెళ్లేందుకు ప్రయత్నించడంతో ప్రయాణీకులు 100కు కాల్ చేయడంతో పోలీసులు నిమిషాల్లో సంఘటన స్థలానికి చేరుకుని ట్రావెల్స్ బస్సును రామచంద్రాపురం పోలీసు ఠాణాకు తరలించారు. పోలీసు ఠాణా వద్ద ట్రావెల్స్ బస్సును ఆపి డ్రైవర్ అక్కడి నుంచి జారుకోవడంతో రాత్రంగా ప్రయాణీకులు పోలీసు ఠాణా వద్ద రోడ్డుపైనే పడిగాపులు కాశారు.

**-ఇంటర్వ్యు మిస్ అయింది-ప్రయాణీకుడి ఆవేదన...**
ఇండియల్ కోస్ట్ గార్డు అసిస్టెంట్ కమాండెంట్ ఇంటర్వ్యూ మిస్ అయిందంటూ చరన్ వర్మ అనే ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు ఓనర్ సునీల్‌కు కాల్ చేసినా పట్టించుకోలేదని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఓం శ్రీ ట్రావెల్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు మూకుమ్మడిగా డిమాండ్ చేయడంతో పాటు రామచంద్రాపురం పోలీసు ఠాణాలో ఈ మేరకు ఫిర్యాదు సైతం చేశారు.

## వేగవంతంగా కొనుగోళ్లు చేయండి


రెడ్డిపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు

**నర్సాపూర్ రూరల్, మే21, ప్రభాతవార్త:**
వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు అన్నారు. మంగళవారం నాడు మండల పరిధి రెడ్డిపల్లి గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని కూడ కొనుగోలు చేస్తామని, రైతులేవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. ఇంకా కొనుగోలు చేయాల్సిన ఎనిమిది లారీల ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేసి ఇతర జిల్లాలకు రవాణా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గౌరిశంకర్, సీసీ ప్రవీణ, సీఏ మహేశ్వరి, గ్రామ సంఘం కమిటీ మరియు రైతులు పాల్గోన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**మనూర్, మే 21, ప్రభాతవార్త:** ఈ నెల 22న నియోజకవర్గ కేంద్రమైన నారాయణఖేడ్‌లోని 132/33 విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి మండల పరిధిలోని పూసల్‌పాడ్ 33/11 ఫీడర్ చానల్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండటంతో పూసల్‌పాడ్ పరిధిలోకి వచ్చే బోరంచ, పంచగామ, మనూర, బెల్లాపూర్, తోర్నాల్, పూసల్‌పాడ్, కరస్‌గుత్తి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ అశోక్‌రెడ్డి తెలిపారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు గాను విద్యుత్ తీగలకు తాకే చెట్టు కొమ్మలను తొలగిస్తున్నందుకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా కాదన, అందుకు వినియోగదారులు ముందస్తుగా ఇతర ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వినియోగదారులు విద్యుత్ అధికారులకు తమ వంతుగా సహకారం అందచేయాలని అశోక్‌రెడ్డి వినతి చేశారు.

**ములుగు మండల పరిధిలో..**
**ములుగు, మే 21 (ప్రభాతవార్త):** ములుగు మండల పరిధిలోని ఆర్‌అండ్ ఆర్ కాలనీ, చిన్నతిమ్మాపూర్, వంటిమామిడి ఇండస్ట్రియల్ ఫీడర్‌తో పాటు కొక్కొండ సబ్‌స్టేషన్ పరిధిలో గల బస్వాపూర్ ఇండస్ట్రియల్, సింగన్నగూడ ఫీడర్‌లోని కొక్కొండ, సింగన్నగూడ, శ్రీరాంపూర్ గ్రామాలకు ఈనెల 22వ తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ములుగు విద్యుత్ శాఖ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 33కెవి క్షీరసాగర్ ఫీడర్, సబ్‌స్టేషన్ పరిధిలోని క్షీరసాగర్, అన్నసాగర్, గంగధార్‌పల్లి గ్రామాలకు ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. విద్యుత్ వైర్లకు ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలను కట్ చేయడానికి గానూ విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

**నర్సాపూర్ మండల పరిధిలో..**
**నర్సాపూర్ మే, 21. ప్రభాతవార్త :** నేడు 22 వ తేదీ బుదవారం నర్సాపూర్ పట్టణంతో పాటు మండల పరిధిలోని గ్రామాలో విద్యుత్ సరపరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్‌లోని 132భై 33 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు, మరమ్మత్తు పనులు నడుస్తున్నాయని తెలిపారు. ఈమేరకు నేడు బుదవాకం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం12 గంటల వరకు కరెంటును నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అంతేగాక నర్సాపూర్ మండల పరిధిలోని నర్సాపూర్, ఆవంచ. రెడ్డిపల్లి, చిప్పల్‌తుర్తి, కాగజ్‌మద్దూర్, లింగాపూర్, మూసాపేట్ గ్రామాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోకూడ కరెంటును నిలిపివేస్తున్నట్లు తెలిపా రు. ఈమేరకు ప్రజలు గమనించాలని విద్యుత్ శాఖ ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు.

## భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

**-స్ట్రాంగ్ రూంలో ఉన్న ఈవీఎంలపై ప్రత్యేక నిఘా ఉండాలి**
**-స్ట్రాంగ్ రూంల భద్రత పరిశీలన**
**-జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరి క్రాంతి**

**పటాన్‌చెరు, మే21, ప్రభాతవార్త:**
ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూం వద్ద ఉన్న భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జహిరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఆర్‌ఓ, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. మంగళవారం పటాన్‌చెరు సమీపంలోని గీతం యూనివర్సిటి కళాశాలల్లో, స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చిన నారాయణఖేడ్, ఆందోల్, బాన్సువాడ, జహిరాబాద్, ఎల్లారెడ్డి, కామారెడ్డి, జుక్కల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లకు సంబంధించిన ఈవీఎంలను, స్ట్రాంగ్ రూం వద్ద పోలిస్ భద్రతను, సీసీ కెమెరాల పనితీరును, కంట్రోల్ రూం రికార్డులను, పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్ట్రాంగ్ రూం వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉండాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిమ్జ్ ప్రత్యేక అధికారి రవీందర్‌రెడ్డి, సర్వేయర్ కోటేశ్వర్‌రావు, ఎఆర్‌ఓ, పోలీస్ సిబ్బంది, పాల్గోన్నారు.


స్ట్రాంగ్ రూం వద్ద భద్రత విషయంలో విధుల నిర్వహణను అధికారులను అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి 10 రోజుల్లో పూర్తి చేయాలి

**-మెదక్ ఉమ్మడి జిల్లాల ప్రత్యేక అధికారి భారతి హోలికేరి**


ధాన్యం కొనుగోలు తీరును పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి భారతి హోలికేరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి 10 రోజుల్లో పూర్తి చేయాలని మెదక్ ఉమ్మడి జిల్లాల ప్రత్యేక అధికారి భారతి హోలికేరి అధికారులను అదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డిఎస్‌ఓ తనుజా, వివిధ శాఖల అధికారులతో ధాన్యం కొనుగోలు పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో అమె పాల్గొని మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు ఇంకా రావాల్సి ధాన్యంపై జిల్లా వ్యవసాయ అధికారులు పూర్తి నివేదిక సమర్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు టార్పాలిన్, ప్యాడి క్లీనర్‌లు సరిపడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అదేశించారు. సిఎంఆర్ డెలివరీపై సమీక్షించారు. రైస్ మిల్లర్లు తమ కెపాసిటీ ప్రకారం మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి పంపే విధంగా చూడాలన్నారు. రైస్ మిల్లుల వద్ద స్తలాభావం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హుస్నాబాద్ ప్రాంతంలో కొనుగోళ్లు తుది దశకు చేరుకున్నాయన్నారు. లారీల సమస్య వస్తే వెంటనే లోకల్ ట్రాక్టర్లను వినియోగించుకోవాలన్నారు. అనంతరం దుబ్బాక మండలం హబ్సీపూర్, సిద్దిపేట రూరల్ మండలం ఇరుకోడు గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అమె జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటీ వరకు 50,.953 రైతుల నుంచి2,23,198 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.491 కోట్లకు గానూ రూ.409 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. అమె వెంట వివిధశాఖల అధికారులు జయదేవ్, నాగరాజు, శివప్రసాద్, వేణు ఉన్నారు.

## నిర్మాణ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

**నర్సాపూర్ మే, 21. ప్రభాతవార్త :**
నర్సాపూర్‌మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో కొసాగుతున్న పలు నిర్మాణ పనులను మంగళవారం మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ మున్సిఫల్ సిబ్బందితో కలిసి పరిశీ లించారు. ముఖ్యంగా నర్సాపూర్‌లోని 1 వ వార్డు జగన్నాథరావు కాలనీలోని రోషిణి ప్రభుత్వ పాఠశాలలో నడుస్తున్న మరుగుదొడ్ల పనులు ,పాఠశాల మరమ్మత్తు పనులను ఆయన సంద ర్శించి పరిశీలించారు. అంతేగాక పట్టణంలోని పలు వార్డుల్లో అబివృద్ధి పనుల నిర్మాణాలను సైతం ఆయన పరిశీలించారు. ఈ సందర్బంగా మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ పలు వార్డుల్లో పర్యటిస్తు సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈమేరకు ప్రజల సమస్యలను వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులను, సిబ్బందిని చైర్మన్ అశోక్‌గౌడ్ ఆదేశించారు. ఈకార్యక్రమంలోఫైజాన్, అర్బాస్, జబ్బార్, అక్బర్, రమేశ్, వాహెద్ తదితరులు పాల్గొన్నారు.


నర్సాపూర్‌లోని పలు వార్డుల్లో పర్యటిస్తు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తదితరులు



# వామ్మో హోటల్ ఫుడ్ ..!

-ఫుడ్ ఆర్డర్ చేస్తే ...రోగాలు ఫ్రీ
-హోటళ్లు, రెస్టారెంట్స్‌లో అపరిశుభ్రత
-కల్తీనూనెలతో ఆహార పదార్థాల తయారీ
-బూజు పట్టిన కూరగాయలు, గడువు ముగిసిన ఐస్ క్రీం, సాస్‌లు
-మాంసం ఫ్రిజ్‌లలో పెట్టి రోజులకొద్దీ వాడకం
-ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడుల్లో విస్తుపోయే నిజాలు
-వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచన





**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:**
పైకి చూస్తే హోటల్ రిచ్‌గా కనిపిస్తుందని హోటల్‌కు వెళ్ళి భోజనం చేశామంటే ..మన ఆరోగ్యాన్ని మనమే పాడు చేసుకున్నట్లే..ఎందుకంటే ఇటీవల కొన్ని హోటల్ యజమానులు నాణ్యత ప్రమాణాలను గాలికొదిలేశారు. కల్తీ ఆహార పదార్థాలతో ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు. తాజాగా నగరంలోని పలు హోటళ్లు ,సూపర్ మార్కెట్‌లపై టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహించారు. ఈసందర్బంగా పలు హోటళ్లలో కల్తీ ఆహార పదార్థాలను సీజ్ చేశారు. రత్నదీప్ మార్కెట్‌లో నాసిరకం చాక్లెట్లు లభ్యయం అయ్యాయి. అలాగే జంబో కింగ్ బర్గర్లో క్వాలిటీ లేని పిజ్జాలను సీజ్ చేశారు. కామత్ హోటల్‌లో నాణ్యతలేని టీ ఫౌండర్ స్వాధీనం చేసుకున్నారు. షాగౌస్ హోటల్‌లో నాసిరకం వంటలతోపాటు కిచెన్ అపరిశుభ్రతను గుర్తించారు. దీంతో నాణ్యతలేని ఆహార పదార్థాలు తయారు చేయడంపై అధికారులు సీరియస్ అయ్యారు. ఫుడ్‌సేఫ్టీ అథారిటీ నెలరోజులుగా నగరంలోని స్పెషల్‌డ్రైవ్ చేపడుతున్నారు.వివిధ రకాల హోటళ్ల నుంచి శాంపిల్స్ సేకరించారు. దాదాపు 29శాంపిల్స్ నిబంధనలు విరుద్ధంగా గుర్తించారు. రిపోర్టు ఆధారంగా సదరు హోటళ్లపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

**అభివృద్ధితోపాటే ..శరవేగంగా రోగాలు..**
అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో పలు దేశాలకు సంబంధించిన వంటకాలకు కూడా ప్రసిద్ధి. వివిధ దేశాలకు చెందిన వంటకాల పేరుతో ఎన్ని చాలావరకు హోటళ్లు వెలుస్తున్నాయి. అయితే నగరం ఎంత శరవేగంగా అభివృద్ధి చెందుతుందో అంతే వేగంగా రోగాలు కూడా వ్యాప్తి చెందుతున్నాయి. పేరుకు రుచికరమైన వంటకాలు అని చెబుతూ ఏమాత్రం శుభ్రతపాటించకుండా రోగాలను కూడా విస్తరింపజేస్తున్నాయి. పురుగులు పట్టిన నిత్యవసర వస్తువులు, గడువు ముగిసిన మసాలాలు. లేబుల్ లేని జీడిపప్పు లాంటి వస్తువులు అధికారులు నివ్వేరపోయేలా చేశాయి. జూబ్లీహిల్స్‌లోని ఓ హోటల్‌కు చెందిన కిచెన్‌లో వినియోగదారులకు అందజేస్తున్న ఆ హారంలో ఫంగస్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కిచెన్‌లో ఇష్టానుసారంగా బొద్దింకలు, గడువు తీరిన సాస్, పాడైపోయిన చేపలు, చికెన్, మయోనైస్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా హోటల్ యజమానికి నోటీసులు జారీ చేశారు. గత 20 రోజుల్లో దాదాపు 75 హోటల్‌లను తనిఖీలు జరుపగా విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. రెస్టారెంట్‌లు, మండీలు, ఐస్‌క్రీం, టీ, కాఫీ షాపుల లోని వంట గదులు పరిశీలిస్తే అన్నీ అపరిశుభ్రంగా ఉన్నాయి. అనేకహోటళ్లలో వాడిన నూనేను వాడుతున్నట్లు గుర్తించారు. అలాగే ఫ్రిజ్‌లలో కనిపించిన వస్తువులను చూసి అధికారులు విస్తుపోయారు. బూజు పట్టిన కూరగాయలు, చీజ్, శాండ్‌విచ్ బ్రెడ్‌లు, సిరప్, కల్తి పదార్థాలు, గడువు ముగిసిన సీసాలలో నిలువుంచిన వస్తువులు, సాస్‌లు, కంపు కొడుతున్న చేపలు, చికెన్, మటన్ లాంటివి విస్తుపోయేలా చేశాయి.

ఎలాంటి బ్రాండ్ లేకుండా పాలు, పనీర్, చీజ్, క్రీం లాంటివి పాడైపోయి ఉన్నాయి. ఎలాంటి నాణ్యతలేని వస్తువులు నెలల తరబడి నిలువున్నట్లు కనిపించాయి.

## కుల జనగణన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

-బహుజన లెఫ్ట్ పార్టీ(బిఎల్‌పి) రాష్ట్ర అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాశ్

**చిక్కడపల్లి,మే 21 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో చేసిన వాగ్దానం ప్రకారం రాష్ట్రంలో కుల జనగణన అనంతరమే స్థానిక సంస్థల్లో 43శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేయడం ద్వారా బీసీ, ఎంబీసీలకు వర్గీకరణతో కూడిన బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ(బిఎల్‌పి) రాష్ట్ర అధ్యక్షుడు, బిఎల్‌ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాశ్ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిఎల్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో బిఎల్‌ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో నల్లా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీలకు రాజ్యాంగబద్ద రిజర్వేషన్‌లు ఉండడం వల్లే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్నతస్థానానికి రాణించగలుగుతున్నారన్నారు. దేశరాజధానిలో దాదాపు 60శాతం ఉన్న బీసీ జాతులకు అసెంబ్లీ, పార్లమెంట్ లాంటటి చట్టసభలకు రాజ్యాంగపర రాజకీయ రిజర్వేషన్‌లు లేకపోవడం వల్లనే బీసీ సమాజం వెనుకబాటుకు కారణమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా అభివృద్ధి చెందిన జాతి మాత్రమే ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో అభివృద్ధి సాధించగలదని చరిత్ర చెబుతున్న సత్యమిదేనన్నారు. అయితే ఆధిపత్య కులాల యాజమాన్యంలోని రాజకీయ పార్టీల కనుసన్నులలో మెదిలే రాజకీయ బానిసల పట్ల స్వయం గౌరవం ఉన్న బీసీలు, ఎస్సీ,ఎస్టీలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా బీసీ సమాజానికి ఈ బానిసల నుంచి మొదటి ప్రమాదం పొంచి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బెజెపి, బిఆర్‌ఎస్ లాంటి ఆధిపత్య కులాల యాజమాన్యంలోని రాజకీయ పార్టీల్లో పనిచేసే ఎస్సీ,ఎస్టీ, బీసీలు తమ జాతి ప్రజల ప్రయోజనాల కంటే తమ బంధువుల వారసుల కోసమే జాతి ప్రయోజనాలను తాకట్టుపెడుతుంటారని విమర్శించారు. పార్టీ ఏదైనా ఆధిపత్య కులాల యాజమానయంలోని రాజకీయ పార్టీల్లో పనిచేసే వారికి ఎప్పుడు స్వయం గౌరవ(ఆత్మగౌరవం) ఉండదని, ఇలాంటి వారినే మాన్యవర్ కాన్షీరామ్ 'రాజకీయ చెంచాలుగా' పోల్చారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో బిఎల్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సిద్ధిరాములు, ఉపాధ్యక్షుడు సబ్బని లత, ఎం.ఎ.గౌడ్, సహాయ కార్యదర్శి మారోజు సునీల్‌కుమార్, సభ్యులు ఎం.ఆంజనేయులు, వడ్ల సాయికృష్ణ, కె.సమ్మయ్య, కర్రేవార్ నగేష్, అబ్బగోని అశోక్‌గౌడ్, ఎలిమినేటి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# ఎడాపెడా మందులు

-ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో మందులను రాస్తున్న కొందరు వైద్యులు -కాంబినేషన్‌లో రెండు మూడు రకాల మందుల వల్ల సైడ్ ఎఫెక్ట్స్

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త**
వైద్యులపై విశ్వాసంతో రోగులు వారి వద్దకు వెళుతుంటారు. చిన్నా చితకా అనారోగ్య సమస్యల్ని సైతం వారికి చెప్పుకుంటారు. కానీ కొందరు డాక్టర్ల అవగాహన రాహిత్యం రోగుల పాలిట శాపంగా మారుతో ంది. అవసరం లేకున్నా ఎడాపెడా మందులు రాస్తున్నారని భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎం ఆర్) పరిశోధనలోనూ వెలుగు చూసింది. పేరెన్నికగన్న ఆసుపత్రులు మొదలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో డాక్టర్లు రాస్తున్న ప్రిస్క్రిప్షన్లలో నిబంధనల అతిక్రమణ జరుగుతున్నట్లు పరిశోధన తేల్చింది.

**పీజీ విద్యార్థుల నుంచి అనుభవజ్ఞుల వరకు..**
వైద్యులు రాసిన ప్రిస్క్రిప్షన్ల ఏ మేరకు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయన్న దానిపై ఐసీఎంఆర్ పరిశోధన చేసింది. మొత్తం 4,838 ప్రిస్క్రిప్షన్లను అధ్యయనం చేసింది. ఇందులో 55శాతం ప్రిస్క్రిప్షన్లు మాత్రమే నిబంధనల మేరకు ఉన్నాయని, 45శాతం ప్రిస్క్రిప్షన్లలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని నిర్ధారించింది. 9.8శాతం ప్రిస్క్రిప్షన్లలో పూర్తిగా నిబంధనల ఉల్లంఘన జరిగిందని స్పష్టం చేసింది. జనరల్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, ఆప్తమాలజీ, ఈఎన్‌టీ, సైకియాట్రీ, ఆర్థో, ఛాతీ, డెంటల్, సూపర్ స్పెషాలిటీలకు చెందిన అన్ని విభాగాల్లో డాక్టర్లు రాసిన ప్రిస్క్రిప్షన్లలో నిబంధనల అతిక్రమణ జరుగుతోంది. ఐసీఎంఆర్ అధ్యయనం చేసిన ప్రిస్క్రిప్షన్లు రాసిన వారిలో పీజీ విద్యార్థులు మొదలు నాలుగు నుంచి 18ఏళ్ల అనుభవం ఉన్న వైద్యులు కూడా ఉన్నారు. పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రిస్క్రిప్షన్లలో సగటున నాలుగు మందులు అనవసరంగా రాసినట్లు పరిశోధనలో గుర్తించారు.

**జలుబుకు ఇన్ని మందులా..!**
సాధారణ జలుబుకు కూడా డాక్టర్లు ఇష్టారాజ్యంగా మందులు రాసేస్తున్నారు. ఐసీఎంఆర్ నివేదిక ప్రకారం.. జలుబు, తేలికపాటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్లకు సంబంధించి మాంటిలూకాస్ట్+లివోసిట్రిజిన్, పారాసిటమాల్, డెక్స్‌ట్రోమిథార్ఫాన్, రాబిప్రజోల్+డోమ్‌పెరిడోన్ మందులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయి. వీటిని అనవసరంగా రాస్తున్నారు. ఈ రెండు నిషేధిత జాబితాలో కూడా ఉన్నాయి. వీటి వల్ల ఖర్చు పెరుగుతుంది. పైగా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, బీపీ, షుగర్, మలేరియా, కీళ్ల నొప్పులు, మైగ్రెయిన్, కడుపులో మంట, అజీర్తి, పిప్పిపళ్లు, చెవిపోటు, టీబీ, పోస్ట్ కోవిడ్‌కు సంబంధించిన జబ్బుల్లో అత్యధికంగా నిబంధనల అతిక్రమణ జరగుతోంది. అజిత్రోమైసిన్, ర్యాంటిడిన్, ట్రిప్సిన్ వంటవి కూడా ఎక్కువగా దుర్వినియోగం అవుతున్నాయి. ప్రిస్క్రిప్షన్లలో వీటిని ఎడాపెడా రాసేస్తున్నారు. చెవికి, శ్వాసకోశానికి ఒకేరకమైన మందులు వాడుతున్నారు.

**నొప్పి మందులతో పాటు అసిడిటీ మందులు ఎందుకు ?**
నొప్పి మందుల వల్ల అసిడిటీ వచ్చే అవకాశం ఉంది. అయితే ఎసిడిటీ రిస్క్ ఉన్న వారికే ఆయా మందులు రాయాలి. కానీ అందరికీ రాస్తున్నారు. దీనివల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నాయి. తేలికపాటి ఆహారం తీసుకుంటే సరిపోయే వారికి కూడా అసిడిటీ మందులు రాస్తున్నారు. అసిడిటికి సంబంధించి పాంటోప్రాజోల్, రాబిప్రజోల్+డోంపెరిడోన్ అనే మందులు అత్యంత దుర్వినియోగానికి గురవుతున్నాయి. 21.9శాతం ప్రిస్క్రిప్షన్లు అనవసరంగా రాసినట్లు నిర్ధారించారు.

**రియాక్షన్లు.. దుష్ప్రభావాలు**
కీళ్లనొప్పులకు రాస్తున్న సెరాసోపెప్టిడేజ్ అనే మందు పనిచేస్తుందో లేదో స్పష్టత లేదని ఐసీఎంఆర్ తేల్చింది. కర్ణభేరి ఇన్ఫెక్షన్లకు వాడే సెఫిక్జిమ్ మెడిసన్ మొదటి ప్రాధాన్యం మందుకాదు. కానీ అధికంగా వాడేస్తున్నారు. బీపీ, శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల మందులను అనవసరంగా రాస్తున్నారు. ఇవి నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయి. ఆయా మందులు వాడటం వల్ల మందుల ఖర్చు పెరుగుతుంది. డ్రగ్ రియాక్షన్లకు కారణమవుతున్నాయి. కాంబినేషన్‌లో రెండు మూడు మందులు రాయడం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తుంటాయి.

**డోసులు ఎక్కువ తక్కువ!**
నిబంధనల అతిక్రమణలో మందులు అధికంగా, అనవసరంగా రాయడమే కాదు.. డోసులు తక్కువ లేదా ఎక్కువ ఉండటం కూడా జరుగుతోంది. మందులు ఎన్నిరోజులు వాడాలి, రోజుకు ఎన్నిసార్లు వాడాలన్న దానిపైనా ప్రిస్క్రిప్షన్లు సరిగా ఉండట్లేదు. ఫార్ములేషన్‌లో తప్పులు జరుగుతున్నట్లు నిర్ధారించారు. డయాబెటిక్ మందులు, హార్మోన్ మందులు, రక్తాన్ని పలుచన చేసే మందులు ఎక్కువగా దుర్వినియోగం అవుతున్నాయి. బీపీ, షుగర్, ఫిట్స్ రోగాలకు వాడే మందుల్లో సరైన కాలపరిమితిపై స్పష్టత ఇవ్వడంలేదు.

**డాక్టర్లకు అవగాహన కల్పించాలి : డాక్టర్ రంగయ్య**
ప్రజలు వైద్యం కోసం పెట్టే ఖర్చులో 40శాతం మందులకే వెచ్చిస్తున్నారు. మం దుల వినియోగం శాస్త్రీయంగా జరగాలి. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 344 మం దుల కాంబినేషన్లను నిషేధిత జాబితాలో చేర్చింది. వీటిపై డాక్టర్లకు పూర్తి అవ గాహన కల్పించాలి. ఐసీఎంఆర్ తీసుకువచ్చిన స్టాండర్డ్ ట్రీట్‌మెంట్ గైడ్‌లైన్స్ కేవలం వెబ్‌సైట్‌కే పరిమితం అవుతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ నిబంధనలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలి.

## కూకట్‌పల్లిలో మెరైన్ పార్క్ ఎగ్జిబిషన్‌లో జలకన్యల ప్రదర్శనలు





## ప్రైవేట్ కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదద్దుతున్నాం

-తల్లిదండ్రులు తమ పిల్లలను గవర్నమెంట్ స్కూల్‌లో చేర్పించాలి
-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



కాచిగూడ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**హైదరాబాద్,మే 21,ప్రభాతవార్త:**
ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించిన ప్రైవేట్ కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దడం జరుగుతుందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో అమ్మ ఆదర్శ ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన పనులను ఆయన డీఈవో రోహిణి, టిజి డబ్ల్యూఐడీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ షఫీమియా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. సైఫాబాద్ మాదన్నపేట ఎరుకల బస్తీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి ఆందులో చేపట్టిన పనులను పరిశీలించారు. పాఠశాలల్లో పార్కింగ్ మంచి టైల్స్‌తో ఏర్పాటు చేయాలని పనులను త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను ప్రైవేట్ పాఠశాల కంటే మెరుగ్గా తీర్చి దిద్దుతున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపేలా విద్యాకమిటీ సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులను ప్రోత్సహించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తనకు చెప్పాలని సూచించారు. అనంతరం మలక్‌పేట్‌లోని ప్రభుత్వ అంధుల బాలికల ఉన్నత పాఠశాలలో చేపట్టిన పనుల పురోగతిని పరిశీలించారు. పాఠశాలలో ఫ్యాన్స్,ట్యూబ్స్, కంప్యూటర్ రూమ్స్, టాయిలెట్స్‌ను పరిశీలించి చిన్నచిన్న రిపేర్లను త్వరగా పూర్తిచేయాలన్నారు. పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న పాత భవనం తొలగించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. తదుపరి కాచిగూడ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న స్క్రాప్‌ను వెంటనే తొలగించాలని అదికారులను ఆదేశించారు. పాఠశాలలోని తలుపులు, కిటికీలు ఫ్యాన్లు,ట్యూబ్స్ ఏర్పాటు చేయాలని, మరమ్మత్తు పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రోహిణీ, టీజీఈడబ్ల్యూఐడీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షఫీమియా, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆర్.లక్ష్మీ, అంజిరెడ్డి, అస్రాఫాతిమా, రాజిరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## తరతరాలకు స్ఫూర్తి ప్రకాశంపంతులు ఆశయాలు

- రాష్ట్ర ఐటిశాఖ మంత్రి శ్రీధర్‌బాబు



ఆంధ్రకేసరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, శ్రీరామ్, గోపాలకృష్ణ, దైవజ్ఞశర్మ, వాణిదేవి తదితర అతిథులు

**నాంపల్లి, మే 21 ప్రభాతవార్త :**
ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు 67వ వర్ధంతిని పురస్కరించుకొని అసెంబ్లీ ఎదురుగా రవీంద్రభారతి కూడలి వద్దనున్న ఆయన నిలువెత్తు విగ్రహానికి పుష్పాంజలి సమర్పించి ఘననివాళులర్పించిన తెలంగాణ రాష్ట్ర ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయాలు, ఆలోచనలు, సిద్ధాంతాలు ఈ తరమేకాదు తరతరాలకు కూడా ఎంతో స్ఫూర్తినిస్తాయని, నేటితరం ఆ స్ఫూర్తిని పుణికిపుచ్చుకొని దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ప్రకాశం పంతులు న్యాయనిపుణుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త, అనినీతిలేని గొప్ప రాజకీయ నాయకుడని, అతను సంపాదించినదంతా పేదలకే అందించాడని గుర్తుచేశారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి, వర్ధంతులను ప్రతీ సంవత్సరం జరుపుతున్న టంగుటూరి అధ్యయన సంస్థను అభినందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాల సహాయసహకారాలు అందించి ఆదుకొంటుందని ఆయన హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో పంతులు మనవడు టి.గోపాలకృష్ణ, టంగుటూరి శ్రీరామ్, ఎన్.రామచంద్రరావు, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, దైవజ్ఞశర్మ, వేణుగోపాలాచారి, డా. మోహన్‌రావు, వాణీప్రదీప్, నిరంజన్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

### కొండాపూర్‌లో విద్యుత్ షాక్‌తో కాంట్రాక్టు కార్మికుడు మృతి

**గచ్చిబౌలి, మే 21 ప్రభాతవార్త :** కొండాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఓ కాంట్రాక్టు కార్మికుడు విద్యుత్‌ఘాతానికి గురై మృతిచెందాడు. బిల్లు జనరేట్ చేసే ఒప్పంద కార్మికుడితో ఎల్‌టి విద్యుత్ లైన్ స్విచ్‌బోర్డు మరమ్మతు పనులు చేయించగా, సమస్య మీద అవగాహన లేని కాంట్రాక్టు కార్మికుడు విద్యుత్‌షాక్‌తో ప్రాణాలు వదిలాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండాపూర్‌లో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా పొన్నూరు మండలం దుప్పలపూడికి చెందిన ఆనంద్‌బాబు(32) కొండాపూర్ సబ్ స్టేషన్‌లో బిల్లు జనరేట్ ఒప్పంద కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కాగా సోమవారం సాయంత్రం రాఘవేంద్రకాలనీ సిబ్లాక్‌లో గల అర్జున్ హోమ్స్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, సరఫరా పునరుద్ధరణ కోసం గ్రూప్‌లో మెసేజ్ పెట్టారు. దీంతో కొండాపూర్ సబ్ స్టేషన్ అధికారులు ఆనంద్‌బాబును ఎల్‌టి లైన్ స్విచ్‌బోర్డు మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు. దీంతో అర్జున్ హోమ్స్‌కు వెళ్లిన ఆనంద్‌బాబు ఎల్‌టి లైన్ స్విచ్‌బోర్డులో పని చేస్తుండగా, విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మీటర్ రీడింగ్ ఒప్పంద కార్మికుడితో ఎల్‌టి లైన్ స్విచ్‌బోర్డు మరమ్మతు పనులు చేయించడంతో పనుల మీద అవగాహన లేక విద్యుత్ షాక్‌కు గురైన ఆనంద్‌బాబు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించగా, సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య సామ్రాజ్యం, కుమారుడు కార్తీక్(9), కుమార్తె అశ్విత(7)లు ఉన్నారు. కాగా ఆనంద్ బాబు మృతదేహాన్ని మొదట కొండాపూర్ ఆసుపత్రికి తరలించగా, కుటుంబ సభ్యులు కొండాపూర్ ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. ఆనంద్‌బాబు మృతికి విద్యుత్ శాఖ అధికారులే కారణమని, తనకు తెలియని పనిని అప్పగించి అధికారులే మృతికి కారణమయ్యారని వారు ఆరోపించారు.

### అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త

**ఉప్పల్, మే 21 ప్రభాతవార్త :** భార్యపై అనుమానంతో ఒక వ్యక్తి ఆమెను దారుణంగా హత్య చేసిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ మధుసూధన్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామకు చెందిన భూక్య రమేష్ 35కు కరీంనగర్‌కు చెందిన భూక్య కమలతో కొద్ది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే సోమవారం రాత్రి భార్యభర్తలు ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రి 9 గంటల సమయంలో తిరిగి వచ్చారు. భార్య భర్తలు ఒక సంస్థలో బరువు తగ్గించే మందులు ఇస్తున్నారు. అయితే వీరికి గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. అక్రమ సంబంధం విషయంపై గొడవ పడడంతో భార్యను కిందకు తోసివేసినట్లు తెలిపారు.దీంతో ఆమె కిందపడగా గొంతుపై కాలుతో నొక్కి హత్య చేసినట్లు తెలిపారు.అనంతరం నిందితుడు పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. వీరి పిల్లలు కరీంనగర్‌లోని తల్లిదండ్రుల వద్ద ఉన్నారని, క్షణికావేశంలో హత్య చేసినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గడువులోపు భవన నిర్మాణ అనుమతులు పూర్తి చేయాలి

-ఏదో ఒక కారణంతో రిజెక్ట్ చేయడం సరికాదు
-టౌన్‌ప్లానింగ్‌శాఖ సమీక్షా సమావేశంలో జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్



టౌన్‌ప్లానింగ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ రోనాల్డ్‌రోస్, సిసిపి రాజేంద్రప్రసాద్ నాయక్

**హైదరాబాద్,మే 21,ప్రభాతవార్త:**
టౌన్‌ప్లానింగ్‌శాఖ అధికారులు టిజీబిపాస్‌లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్ అన్నారు. మంగళవారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలోని పన్వర్‌హాల్‌లో టౌన్‌ప్లానింగ్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా టిజిబిపాస్ కింద వచ్చిన బిల్డింగ్ పర్మీషన్‌లకు సంబంధించి దరఖాస్తులను జాప్యం చేయకుండా వేగవంతంగా పరిష్కరించాలన్నారు. నిర్ణీత కాలవ్యవధిలో నిబంధనల మేరకు అర్హత గల దరఖాస్తులను అప్రూ చేయాలని ఏదో ఒక కారణంతో రిజెక్ట్ చేయడం సరికాదన్నారు. ముఖ్యంగా చాలా దరఖాస్తుల్లో షార్ట్‌ఫాల్స్ రేస్ చేస్తున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందన్నారు. పెండింగ్ దరఖాస్తులను, అక్యూపెన్సీ సర్టిఫికేట్ అన్నింటిని నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. అనుమతుల విషయంలో పలుచోట్ల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని గత నాలుగైదునెలల్లో షార్ట్‌ఫాల్స్ ,రిజెక్ట్ చేసిన దరఖాస్తుల వివరాలు అందించాలని కోరారు. ఈవిషయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు తమ పనితీరును మెరుగు పరుచుకోవాలన్నారు. ఈసందర్భంగా ఏసిపి వారిగా ఉన్న షార్ట్‌ఫాల్స్, రిజెక్ట్ అయిన దరఖాస్తుల వివరాలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలు సర్కిళ్ల వారీగా సమీక్షించారు. ఎన్నాంట్ రిజిస్ట్రేషన్లు, ఇన్‌స్టెంట్ అప్రూవల్ దరఖాస్తుల సంబంధించి జాప్యం చేయొద్దని క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే ఆమోదించాలని సూచించారు. అలాగే కమర్షియల్ అనుమతులకు సంబంధించి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. అలాగే శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించడంతోపాటు ప్రతిగల్లీ,గల్లీ వెళ్ళి చూడాలని సెల్లార్‌లను పరిశీలించాలని కమిషనర్ సూచించారు. ఈసమావేశంలో సిపిలు, ఏసిపిలు, సెక్షన్ ఆఫీసర్లు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## భూగర్భ జలాల వృద్ధికి "షాలో అక్విఫర్ ప్రాజెక్ట్ "

-కేంద్ర గృహనిర్మాణ,పట్టణ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో నిర్వాహణ -జిహెచ్‌ఎంసి పరిధిలోని 5మున్సిపల్ పార్కుల్లో ప్రయోగం



హబ్సిగూడలోని కాకతీయపార్కులో అవగాహన కల్పిస్తున్న ఎన్ఐయుఐఏ,జిహెచ్‌ఎంసి ప్రతినిధులు

**హైదరాబాద్,మే 21,ప్రభాతవార్త:**
ప్రస్తుతం నగరంలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లు ఎండిపోతున్నాయి. అదేసమయంలో చిన్నపాటి వర్షానికి నగరంలోని వీధులన్నీ జలమయం అవుతున్నాయి. ఈసమస్యను పరిష్కరించడానికి కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని అమృత్‌పథకంలో భాగంగా " షాలో అక్విఫర్ రీఛార్జ్"ప్రాజెక్ట్‌ను చేపడుతున్నారు. ఈనేపథ్యంలో జిహెచ్‌ఎంసి పరిధిలోని 5మున్సిపల్ పార్కులను పైలెట్ ప్రాజెక్ట్‌లుగాఎంపిక చేసింది. ఖైరతాబాద్ జోన్‌లోని కెఎల్‌ఎన్‌యాదవ్ పార్కు, శేరిలింగంపల్లి జోన్‌లోని టెక్నోపార్క్, సికింద్రాబాద్ జోన్‌లో ఇందిరాపార్క్, ఎల్బీనగర్ జోన్‌లో హబ్సిగూడలోని కాకతీయ నగర్ కాలనీ పార్క్, సైనిక్‌పురి ఈసెక్టార్ పార్కును గుర్తించి అమలు చేస్తున్నారు. ముఖ్యంగా పార్కుల్లో 100 నుంచి 120 అడుగదులోతు వరకు షాలో అక్విఫర్ ఇంజక్షన్ బోర్వెల్‌లను డ్రిల్ చేయడం ఈప్రాజెక్ట్ ముఖ్యఉద్దేశం. లోతు లేనని జలాశయాలలోని నీటిని బయటకి పంపడం ద్వారా వర్షాపాతం ఉన్నప్పుడల్లా భూమిలోని దిగువ పొరలు రీచార్చ్ చేయబడుతాయి. చట్టుపక్కల వాటర్ షెడ్‌నుంచి నీటిని సేకరించడం, రీఛార్జ్ ఫీట్ల ద్వారా పంపడం వల్ల భూగర్భంలోని పొరలను ఇది రీఛార్జ్ చేస్తూ నీటిలెవల్‌ను పెంచుతుంది. ఈప్రాజెక్ట్‌ను దిరైన్ వాటర్ ప్రాజెక్ట్ సహాయంతో అమలు చేయబడుతుంది. మంగళవారం జిహెచ్‌ఎంసి అధికారులు, ఎన్ఐయుఐఏ ప్రతినిధులు, వాటర్ ప్రాజెక్ట్ బృందంతో కలిసి హబ్సిగూడలోని కాకతీయనగర్‌లో కాలనీ పార్కులో కాలనీ వాసులకు అవగాహన కల్పించి ఈప్రాజెక్ట్‌వల్ల కలిగే ప్రయోజనాలను స్థానికులు వివరించారు.


బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న గ్రామస్తులు

## మానవత్వం చాటుకున్న గడ్డ మాల్లయ్యగూడ గ్రామస్తులు

**యాచారం మే21,ప్రభాతవార్త :** యాచారం మండలంలో గడ్డ మాల్లయ్య గూడ గ్రామంలో యార యాదగిరి గత నెల గునగల్ గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మరణించారు.దీంతో గడ్డ మల్లయ్యగూడ అందరూ వారికి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. బంధు మిత్రులు, స్నేహితులు కలిసి రూ.2,46700లను ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి సాయం చేసిన ప్రతి ఒక్కరికి మాజీ సర్పంచ్ అర్చన జంగయ్య కృతజ్ఞతలు తెలిపారు.వారి కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటామని అన్నారు.

## కూలీలందరికి వెంటనే పని కల్పించాలి
### జిల్లా అధ్యక్షుడు అంజయ్య డిమాండ్


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు అంజయ్య

**యాచారం మే21,ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని చింత పట్ల గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం మాజీ మండల అధ్యక్షుడు సిహెచ్ సత్యంతో కలిసి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అంజయ్య ఉపాధి కూలీల దగ్గరికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.సంఘం సభ్యత్వం నమోదు చేసి అనంతరం మాట్లాడుతూ....అంజయ్య మాట్లాడుతూ...గ్రామంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నప్పటికి రైతుల భూముల్లో పని చేయించుకోవడానికి ముందుకు రావడం లేదని దరఖాస్తులు పెట్టుకున్న కూలీలకు పని కల్పించకపోవడం దుర్మార్గం అని అన్నారు.పని కల్పించకపోతే చట్ట ప్రకారం నిరుద్యోగ భృతి అన్ని ఇవ్వాలని 4 నెలల నుండి పనిచేస్తున్న పేస్లిప్పులు ఇవ్వాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినప్పటికి ఇప్పటివరకు పే స్లిప్పులు ఇవ్వకపోవడం దుర్మార్గం అని పేర్కొన్నారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తి విఫలమైందన్నారు.మెడికల్ కిట్టు ,వాటర్ అందుబాటులో లేదని అన్నారు.కూలీల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం మానుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభాకర్,రమేష్ పాల్గొన్నారు.

## మాడ్గుల వ్యవసాయ విస్తీర్ణ అధికారిగా రాధమ్మ

**మాడ్గుల,మే21,ప్రభాతవార్త:** మాడ్గుల వ్యవసాయ విస్తీర్ణ అధికారినిగా జి.రాధమ్మ మంగళవారం బాధ్యతలు చేపట్టారు.మాడ్గుల మండలంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో విధులకు సెలవుపై వెళ్లి వ్యవసాయ శాఖలో ఉన్నత చదువులు పూర్తి చేసుకుని మంగళవారం మాడ్గుల వ్యవసాయ విస్తీర్ణ అధికారినిగా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ మాడ్గుల మండలంలో గతంలో రైతులకు అందుబాటులో ఉండి శాఖపరమైన సేవలు అదించినట్లు గుర్తుచేశారు. మాడ్గుల మండలంలోని రైతులకు సేవలు అందిచే అవకాశం రావడం అనందంగా ఉదన్నారు.

## విద్యార్థులకు ప్లేట్లు పంపిణి చేసిన కానిస్టేబుల్ పరమేశ్వర్




విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న కానిస్టేబుల్ పరమేశ్వర్, ఎంఈవో చంద్రప్ప

**బంట్వారం, మే21, (ప్రభాతవార్త):** స్థానిక పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ జి పరమేశ్వర్ తన కూతురు సాన్వీ జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కొరకు 220 ప్లేట్‌ను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుట్టిన రోజున ఎంత ఖర్చు చేసిన వృదా కాకూడదనే సంకల్పంతో విద్యార్థులకు ఇలాంటి ప నులు చేయడంతో కొంతైన సహాయం చేసిన వారమైతామని చెప్పారు. ఇదే సందర్భంగా ఎంఈవొ చంద్రప్ప మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు ఇతరులకు తన వంతుగా సహాయం చేసె లక్ష్యాన్ని కలిగి ఉండాలన్నారు. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు పేదలకు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తమదైన సహాకారాలు అందించాలన్నారు. దీంతో భవిష్యత్తులో విద్యార్థులు సైతం ఇదే లక్షణాల ు పెంపొందించుకుంటారని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సీఆర్‌పీ నర్సిములు తదితరులును పాలోంగన్నారు.

## నేడు పలు చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం

**మొయినాబాద్, మే 21, ప్రభాతవార్త:** రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు మొయినాబాద్ విద్యుత్ ఆపరేషన్స్ ఏఈ బానోత్ హాము తెలిపారు. విద్యుత్ తీగలకు ఇబ్బందిగా మారిన చెట్లను తొలగించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. అందులో భాగంగానే బుధవారం మొయినాబాద్ మండల పరిధిలోని 11 కేవీ కేతిరెడ్డిపల్లిలో ఉదయం 11 గంటలకు నుంచి మధ్యాహ్నం 1 వరకు, 11కేవీ నాక్కపల్లి ఫీడర్‌లో మధ్యాహ్నం 1 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, ఎస్‌వీ కళాశాల పరిధిలో మధ్యాహ్నం 3 గంటలనుంచి 5 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని అందుకు వినియోగదారుల సహకరించాలని అన్నారు.

## వరుస పిడుగుపాటు సంఘటనలు బాధాకరం
### బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన శ్రీనివాస్‌రెడ్డి


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

**తాండూరు, మే 21, ప్రభాతవార్త :** వరుస పిడుగు పాటు సంఘటనలు చాలా బాధాకరమని ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. యాలాల మండలంలో పిడుగు పాటుకు ముగ్గురు మృతి చెందిన ఘటన మరువక ముందే తాండూరు పట్టణంలో మరో సంఘ టన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. తాండూరు మున్సిపల్ పరిధిలోని పాత తాండూరుకు చెందిన పూరి శేఖర్(40) పిడుగు పాటుతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఆర్బీఓఎల్ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఆయన మృతదేహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడి మృతుడు శేఖర్ భార్య లలితకు ఆర్థిక చేయూత అందించారు.

# నిస్వార్థమైన నాయకుడు రాజవ్ గాంధీ : ఎమ్మెల్యే
### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


షాద్‌నగర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు


ఆమనగల్లులో రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

**షాద్‌నగర్, మే 21, (ప్రభాతవార్త) :** దేశ ప్రజలకు విశేష సేవలందించి తన ప్రాణాలను సహితం లెక్కచేయని భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలను మరువలేమని, నిస్వార్థ రాజకీయాలతో చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన ఆయన మా అందరికీ ఆదర్శమని ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ అన్నారు. మంగళవారం భారత దేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 33వ వర్థంతిని పురస్కరించుకొని షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సమీపంలో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రేడ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో విప్లవాత్మక



రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

మార్పులు తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని ఆయన అన్నారు. నేడు దేశంలో ఐటీ రంగం అభివృద్ధి చెందింది అంటే అందుకు రాజీవ్ చేసిన కృషి ఎన్నటికి మరువలేనిదని ఆయన కొనియాడారు. రాజీవ్ గాంధీ ఆశయాలను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కొనసాగించాలని అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాల అడుగుజాడలలో తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీల ఆశీస్సులతో ప్రజాపాలన అందిస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సీనియర్ నాయకుడు బాబర్‌ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, ఫరూఖ్‌నగర్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు అందెమోహన్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్, సీనియర్ నాయకుడు చెంది తిరుపతిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### చేవెళ్లలో..

**చేవెళ్ల, మే 21 ప్రభాతవార్త :** స్వర్గీయ రాజీవ్ గాంధీ 33వ వర్థంతి వేడుకలను చేవెళ్ల కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో డిసిసి మాజీ అధ్యక్షులు పడాల వెంకట స్వామి, డిసిసి ఉపాధ్యక్షులు బండారు ఆగిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వీరేందర్ రెడ్డి, ఎంపిటిసి, కార్యదర్శి గుండాల రాములు, మాజీ ఉపసర్పం చ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, రవీందర్ రెడ్డి, పాండుయాదవ్ పాల్గొన్నారు.

### ఆమనగల్లులో..

**ఆమనగల్లు, మే21, ప్రభాతవార్త:** భారతదేశ అభివృద్ధి కోసం మాజీ దివంగత ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చాడని పలువురు కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. రాజీవ్ తీసుకువచ్చిన సంస్కరణలతో పలు దేశాలకు ధీటుగా దేశంలో ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ జీవం పోసుకుందని వారు తెలిపారు. మంగళవారం దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ 33వ వర్దంతి వేడుకలను స్థానిక కాంగ్రెస్‌పార్టీ నిర్వహించింది. రాజీవ్ చౌరస్తా వద్ద రాజీవ్‌విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేకంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మండ్లి రాములు, నాయకులు వస్పుల శ్రీశైలం, హలీమ్, ఎంగలి ప్రసాద్, పులికంటి మైసయ్య, పత్యానాయక్, కృష్ణనాయక్, వస్పుల శ్రీకాంత్, ఖాదర్, ఫిరోజ్, అఫ్రోజ్, కొండల్‌రెడ్డి, హరిలాల్, మహే శ్, గాజుల సురేష్, కాలే మల్లయ్య, జంతుక యాదయ్య, వెంకట య్య, గుంద్రాతి కుమార్‌గౌడ్, రామకృష్ణ, శేఖర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ఆరీఫ్, తాళ్ళ సురేష్ తదితరులు ఉన్నారు.

### పెద్దేముల్‌లో..

**పెద్దేముల్, మే 21, ప్రభాతవార్త:** స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధి ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషిచేయాలని కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నల్లా ఎల్లారెడ్డి అన్నారు. మంగళవారం రాజీవ్‌గాంధి వర్దంతి సందర్భంగా పెద్దేముల్ మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎన్.ఎల్లారెడ్డి, టీపీ


రాజీవ్ గాంధీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నేతలు

సిసి మైనార్టీ కన్వీనర్ యండి.రియాజ్, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్య క్షురాలు శోభారాణిమాట్లాడుతూ అతి చిన్న వయసులో ప్రధానమం త్రిగా ఎంపికై దేశసేవలో తనదైన ముద్ర వేసిన గొప్ప నాయకుడు రాజీవ్‌గాంధీ అని అన్నారు.రాజీవ్‌గాంధి అడుగు జాడలలో ప్రతిఒక్కరు నడవవలసిన అవసరం ఎంతైన ఉందని అన్నారు. దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో పురోగమించేందుకురాజీవ్‌గాంధి కీలక నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. నేడు భారతదేశ శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఈ స్థాయిలో పురోగమిస్తుంది అంటే దానికిరాజీవ్‌గాంధి సేవలే నిదర్శనం అని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు నసీర్, బీసీ సెల్ మండల కార్యదర్శి ఆనం దచారీ, మాజీ సర్పంచ్ ఎర్ర బాలప్ప, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోళ్ళ గోపాల్, గ్రామ కమిటి అధ్యక్షుడు డివై నర్సిములు, వార్డు సభ్యులుఫ యాజ్, డివై అరవింద్, సీనియర్ నాయకులు కోహీర్ రవి, బ్యాగరి మల్లేశం, కుమ్మరి సాయిలు, యండి నయ్యుం, ఎన్.వెంకట్‌రెడ్డి లుపాల్గొన్నారు.

### తాండూర్‌లో..

**తాండూరు, మే 21, ప్రభాతవార్త :** మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలు తాండూరులో ఘనంగా నిర్వహించారు. మంగళవారం తాండూరు


రాజీవ్‌గాంధి వర్ధంతిలో పాల్గొన్న నాయకులు

పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. రాంజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కిందని కొనియాడారు. రాజీవ్ చూపిన బాటలో ప్రతిఒక్కరు నడవాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పి.బస్వరా జ్, అబ్దుల్ రావూఫ్, మాజీ డిపిసి సభ్యులు పట్లోళ్ల నర్సింలు, మాజీ ఫ్లోర్ లీడర్ లిగదల్లి రవికుమార్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, జుబేర్‌లాల, నాయకులు బంటు వేణు, బాతుల నాగు తదితరులు పాల్గొర్నారు.

### మేడ్చల్‌లో..

**మేడ్చల్, మే 21, ప్రభాతవార్త :** మాజీ ప్రధాని, స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని మేడ్చల్‌లో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నేతలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రమణారెడ్డి, మున్సిపల్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు వర్ధారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు చాపరాజు, కౌడె మహేష్, నాయకులు సత్యానారాయణ, విజయనందరెడ్డి, రాకేష్, శ్రీధర్, సుధర్శన్‌రెడ్డి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

### ఘట్‌కేసర్‌లో..

**ఘట్‌కేసర్, మే 21, ప్రభాతవార్త:** దేశ శాస్త్ర, సాంకేతిక రంగానికి రాజీవ్ గాంధీ అందించిన సేవలు మరువలేనివని మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేము



ల మహేశ్‌గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ మండలం ఘణాపూర్ పవర్‌గ్రిడ్ వద్ద మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్‌గాంధీ 33వ వర్దంతిని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్‌తో పాటు నాయకులు పూలమాళ వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచులు నానావత్ రూప్‌సింగ్‌నాయక్, వేముల మమతగౌడ్, బద్దం గోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ వేముల సత్తయ్యగౌడ్, వార్డుసభ్యులు వేముల శంకర్‌గౌడ్, గుర్జకుంట నర్సింహ్మా, భాస్కర్, ననావత్ సురేశ్‌నాయక్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పైళ్ల లతరెడ్డి, ఎన్‌ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి నానవత్ శివాజీ నాయక్, నాయకులు జంగారెడ్డి, చందర్‌సింగ్, భానుగౌడ్, శ్రీనివాస్, మల్లేశ్, నేతాజీ యూత్ ఐసభ్యులు మణిశరన్‌గౌడ్, చాణక్యగౌడ్, మణిగౌడ్, ప్రశాంత్‌గౌడ్, సాత్విక్‌గౌడ్, చరణ్, వంశీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మేడ్చల్‌లో రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

# సీఎంఆర్ కళాశాలలో ఎస్‌సిసి విద్యార్థుల క్యాంపు
### వారం రోజుల జాతీయ స్థాయి ఎక్ భారత్ శ్రేష్ట్ భారత్ కార్యక్రమం


క్యాంపులో ఎన్‌సిసి విద్యార్థులకు లెక్చర్ కార్యక్రమం

**మేడ్చల్, మే 21. ప్రభాతవార్త :** ఎన్‌సీసీ విద్యార్థులకు భిన్న సంస్కృతుల పరిచయం కోసం మేడ్చల్ జిల్లాలోని గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎక్ భారత్ శ్రేష్ట్ భారత్ కార్యక్రమం విజయవంతంగా జరుగుతున్నది. క్యాంపు కమాండర్, కల్నల్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించే ఈ జాతీయ స్థాయి క్యాంపులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి 600 మంది ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాలలో ఈ నెల 16వ తేదీన ప్రారంభమైన ఈ క్యాంపు 23వ తేదీ వరకు వారం రోజుల పాటు కొనసాగనున్నది. ప్రతి రోజు ఉదయం పిటి యోగాతో విద్యార్థులకు శిక్షణ ప్రారంభించి అనంతరం వారికి సామాజిక విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు. అందులో ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాదులు, సైబర్ క్రైమ్స్, మానవ సైకాలజీ తదితర విషయాలపై క్షుణ్ణంగా లెక్చర్ ఇస్తున్నారు. విద్యార్థులకు సంప్రదాయాలు, పురాతన కట్టడాల సందర్శన, రాష్ట్రాల చరిత్ర, భాష పరిచయాలు, ఆహార, పరిశ్రమల విషయాలపై ఒకరికొకరు చర్చించుకుని అవగాహన కల్పించుకుంటున్నారు. వివిద రాష్ట్రాల విభిన్న సంస్కృతులను పరిచయం చేసుకోవడమే కాకుండా వారికి అందరి సాంస్కృతిక సాంప్రదాయాలను గౌరవించే విదంగా తర్ఫీదు ఇస్తున్నారు. అదే విదంగా సీనియర్ ఎన్‌సీసీ విద్యార్థులతో రెండు రోజుల శిక్షణ అందించారు. సాయంత్రం సమయంలో వారితో ఆయా రాష్ట్రాల ప్రసిద్దిని ప్రతిబింబించే కథలను, వివిద రకాల ఆటలను ఆడిస్తున్నారు. ఈ నెల 23న క్యాంపు ముగింపు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

### విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు

విద్యార్థుల్లో మార్పు తీసుకురావడానికి ఈ క్యాంపు ఎంతో దోహదం చేస్తుందని డిప్యూటి క్యాంపు కమాండెంట్, లెఫ్ట్‌నెంట్ కల్నల్ ఆనంద్ రావు తెలిపారు.పిల్లల పరివర్తన గుర్తించి వారిలో మార్పు తీసుకురావడానికి శిక్షణ ఇస్తున్నామని, తద్వారా వారిని దృడంగా మార్చే విదంగా తర్ఫీదు ఇస్తున్నట్లు చెప్పారు అంతే కాకుండా వారిలోని వృక్తిత్వాన్ని పెంపొందించి భవిష్యత్‌కు బాటలు వేస్తున్నామని వివరించారు. ఈ క్యాంపులో ట్రైనింగ్ ఆఫీసర్ మీను తోమర్, పలువురు శిక్షకులు ఎన్‌సీసీ విద్యార్థులను పర్యవేక్షిస్తున్నారు.



బస్టాండ్ స్కూల్ ఎదుట ఆటోస్టాండ్ వద్ద అవగాహన కల్పిస్తున్న ఎస్సై బాల్‌రాంనాయక్

## ట్రాఫిక్ రూల్స్‌పై ఆటోవాలాలకు అవగాహన

**ఆమనగల్లు, మే21, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ రోడ్డు రవాణా నియమ నిబంధనలను విధిగా పాటించాలని ఆమనగల్లు ఎస్సై బాల్‌రాంనాయక్ అన్నారు. నిబంధనలకు అతిక్రమించి ఇష్టానుసారంగా వ్యవహించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఎస్సై బాల్‌రాంనాయక్ స్థానిక ఆటోడ్రైవర్‌లకు రోడ్డు నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. గాంధీచౌక్, రాజీవ్‌చౌరస్తా, బస్టాండ్ హై స్కూల్ ఎదుట ఆటోవాలాలను కలుసుకుని అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారవాణా చేసే వాహనాలు పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదు, వాహన భీమా కల్గి ఉండాలి, డ్రెస్‌కోడ్ పాటించాలి, పట్టణంలోని జనసంచార ప్రాంతాల వద్ద అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయరాదన్నారు. మహిళలు, యువతులు, ప్రయాణికుల పట్ల గౌరవంగా మెలగాలని సూచించారు. గ్రామాల్లోకి అనుమానస్పద వ్యక్తులు తారాస పడినప్పుడు విధిగా సమాచారాన్ని పోలీసులకు చేరవేయాలన్నారు. రోడ్డు నిబంధనలు అతిక్రమించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు, కేసులు నమోదు చేస్తామని ఎస్సై బాల్‌రాంనాయక్ హెచ్చరించారు. అనంతరం పట్టణ సమీపంలోని మైదాన ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించగా, మందుబాబులు తారాస పడ్డారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని ఎస్సై హెచ్చరించారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ఆమనగల్లు, మే21, ప్రభాతవార్త:** రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు ఆమనగల్లు ఏఈ సీతారామ్ తెలిపారు. నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు పలు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. అందులో భాగంగానే బుధవారం 33కేవి, 11 కేవీ ఆకుతోటపల్లి, 11కేవీ కాటన్‌మిల్లు (విఠాయిపల్లి) పరిధిలో బుధవారం విద్యుత్ తీగలకు ఇబ్బందిగా మారిన చెట్లను తొలగించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. దీంతో ఆకుతోటపల్లి, ఫీడర్ పరిధిలో ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు సీతారామ్ తెలిపారు. అలాగే మూర్తుజపల్లి లైన్లో మధ్యాహ్నం 2.30 ని.ల నుండి 5.30 ని.ల వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎక్కడైన విద్యుత్ సమస్యలు ఉంటే విధిగా తమ దృష్టికి తీసుకురావాలని అధికారి సూచించారు.

## అనుమతి లేకుండా తాటి ఈత చెట్లను నరకవద్దు
### ఎక్సైజ్ సీఐ బద్యనాయక్

**ఆమనగల్లు, మే21, ప్రభాతవార్త:** ఎటువంటి అనుమతులు లేకుండా తాటి,ఈత చెట్లను నరికివేయడం చట్టరీత్య నేరమని ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ ఆమనగల్లు ఇన్‌స్పెక్టర్ బద్యనాయక్ తెలిపారు. చెట్ల నరికివేతతోపాటు వాటి గెలలను నరకడం నేరమని వివరించారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఆయన ఒక న ప్రకటన విడుదల చేస్తూ తాటి ఈత వనాల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. అనుమతులు లేకుండా చెట్లను నరికివేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవగాహనరాహిత్యాన్ని గుర్తించి ఇటీవల తాటి ఈత చెట్ల నరికివేతపై గీత కార్మిక, రైతులు, రియల్టర్లులకు అవగా హన కల్పించామని ఆయన చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుచు కోవాలని సూచించారు.

## ఘనంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీఅనంతపద్మనాభ స్వామి బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ కమిటీ చైర్మెన్, మాజీ జడ్పీటీసీ

**కొత్తూర్, మే 21, ప్రభాతవార్త :** కొత్తూర్ మండలంలోని పెంజర్ల గ్రామంలో స్వయంభుగా కొలువైన శ్రీదేవి భూదేవి శ్రీఅనంత పద్మనాభ స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆలయ కమిటీ చైర్మెన్ బెజవాడ అనితరెడ్డి, మామిడి శ్యాంసుందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో మంగళవారం అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఉదయం కలశ విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనము, ఆచార్య బ్రహ్మ ఋత్విక్ వర్ణనము, రక్షాబంధన, చెతూస్తానార్చన, అగ్ని ప్రతిష్ట ధ్వజారోహనము, గరుడ హోమం, గరుడ కళ్యాణం, బలిహరణము, హారతి, తీర్థ ప్రసాద వినియోగం, సాయంత్రం విష్వక్సేన ఆరాధన, చతుస్థానార్చన , పంచసూక్త హవనము, మూలమంత్ర హవనము, బలిహరణము, హారతి తీర్థ ప్రసాద వినియోగం వంటి తదితర కార్యక్ర మాలను నిర్వహించారు. భక్తులు ప్రజలు ఈ పూజ కార్యక్రమాలలో అత్యంత భక్తిశ్రద్దలతో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ.... నేడు నిర్వహించే కార్యక్రమాలతో పాటు గురువారం నిర్వహించే స్వామివారి కళ్యాణోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి పూజలో పాల్గొని ఆశీర్వాదం పొందాలన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ మెంబర్ దామోదర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, భక్తులు తదితరులు ఉన్నారు. .

## ఘనంగా స్వామి వార్ల కల్యాణోత్సవ వేడుకలు


స్వామి వారికి కల్యాణోత్సవం జరిపిస్తున్న వేదపండితులు

**ఘట్‌కేసర్ రూరల్, మే 21, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ పరిధిలోని యంనంపేట్ శ్రీ రంగనాథ స్వామి దేవాలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం స్వామి వారి కల్యాణోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో పంచామృతాభిషేకం, సహస్ర పుష్పార్చన, బాలభోగం, హోమం, బలిహరణం వంటి పూజలతో పాటు శ్రీ భూనీళ సమేత రంగనాథ స్వామి మరియు పద్మావతిగోదాదేవి సహిత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవ వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. స్వామి వారి కల్యాణోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా పోచారం మున్సిపల్ చైర్మన్ బి. కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి, ఆలయ ఈవో భాగ్యలక్ష్మి, కౌన్సిలర్లు నర్రి ధనలక్ష్మి, మెట్టు బాల్‌రెడ్డి, సుర్వీ రవీందర్ గౌడ్, బాలగోని వెంకటేశ్ గౌడ్, నాయకులు నర్రి కాశయ్య, బుచ్చిరెడ్డి, నర్రి శ్రీశైలం, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిర్వహకులు భక్తులకు అన్నదానం చేశారు.

### ఇస్మాయిల్ ఖాన్‌గూడలో..

మున్సిపల్ పరిధిలోని ఇస్మాయిల్ ఖాన్‌గూడలోని శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయంలో స్వామి వారి కల్యాణోత్సవ వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. ఆలయ నిర్వహకులు ఈగ లలిత కృష్ణస్వామి ముదిరాజ్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనర్సింహస్వామి దేవత సహిత శ్రీరేణుక ఎల్లమ్మదేవి కల్యాణ మహోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ గొంగళ్ల మహేశ్ కురుమతో పాటు స్థానిక నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు నిర్వహకులు అన్నదానం చేశారు.



మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నేతలు



స్వర్గీయ రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



కొమురవెల్లిలో నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు



చిన్నశంకరంపేటలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



రాజీవ్ గాంధీ వర్థంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం



చిట్కుల్‌లోని క్యాంప్ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పిస్తున్న నిలం మధు ముదిరాజ్



నర్సాపూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రదాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# రాజీవ్ గాంధీకి ఘన నివాళులు

**జహీరాబాద్ పట్టణంలో**

**జహీరాబాద్, మే 21, ప్రభాతవార్త:** భారతీ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి వేడుకలను మంగళవారం పట్టణంలోని సుభాష్‌గంజ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. భారత దేశానికి రాజీవ్ గాంధీ అందించిన సేవలను ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కండెం నర్సింలు, మండల అధ్యక్షులు నరసింహారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్, డిసిసిబి డైరెక్టర్ కిషన్‌రావు పవర్, మాజీ కౌన్సిలర్లు అరుణ్ కుమార్, జాంగీర్, యూనస్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రమేష్ బాబు, జయరాజ్, ఇనాయత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

**సిద్దిపేట,కొమురవెల్లిలలో**

**సిద్దిపేట రూరల్/కొమురవెల్లి, మే 21, ప్రభాతవార్త :** రాజీవ్ గాంధీ యువ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి దేశానికి ఎనలేని సేవలు చేశారని డీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ డా॥లక్కరసు సూర్య ప్ర వర్మ, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కో-ఆర్డినేటర్ దాసరి రాజులు అన్నారు. స్వర్గీయ రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా మంగళవారం డీసీసీ ఓబీసీ సెల్, ఎన్ఎస్‌యుఐ అధ్వర్యంలో అయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణా త్యాగం చేసిన గొప్ప నాయకులు స్వర్గీయ రాజీవ్‌గాంధీ అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ, కాంగ్రెస్ నాయకులు జంగోని శ్రీనివాస్, దిలీప్, మోతే కుమార్, కొండల వాడి సతీష్, రాకేష్ యాదవ్, అర్జున్, సాజిద్, మిద్దె ప్రసాద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**కొమురవెల్లిలో..**

మండల కేంద్రంలోని కొమురవెల్లిలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లింగంపల్లి శ్రీనివాస్‌ల అధ్వర్యంలో స్వర్గీయ రాజీవ్‌గాంధీ 33 వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అతి పిన్న వయస్సులో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి ఎన్నో సంస్కరణలు చేపట్టారని తెలిపారు. అయన దేశానికి చేసిన సేవలు మరవ లేనివన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు లింగంపల్లి కనకరాజు, సానాది భాస్కర్, శ్రీనాథ్‌రెడ్డి, సార్ల లింగం, స్వాములపల్లి రమేష్, బ్రాహ్మణపల్లి చంద్రం, పబ్బోజు రాములు, ఎక్కలదేవి శ్రీనివాస్, పుట్ట నరసింహులు, జంగని రవి, ఎంకి కనకయ్య, నర్సింహ్మారెడ్డి, క ఒకణాల ప్రవీణ్, తురాయి నవీన్, నాగరాజు, చింతల రమేష్, మురళి, రాజు, నవీన్, మహేష్, కనకరాజు, రమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**చిన్నశంకరంపేట పట్టణంలో**

**చిన్నశంకరంపేట,మే21,ప్రభాతవార్త:** దేశానికి సాంకేతికతను తిసుకువచ్చింది రాజీవ్ గాంధీనేనని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. రాజీవ్ గాంధి వర్ధంతి సందర్భంగా మంగళవారం మండల పరిధి చిన్నశంకరంపేట పట్టణంలోని బస్టాండ్ చౌరస్తాలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచి రాజీరెడ్డి, మాజీ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంభుని రాజ్‌కుమార్‌గౌడ్, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రం, రేవంత్ ఫోరం నాయకులు మోహన్ నాయక్, నాయకులు బోండ్ల రామస్వామి, గజం శేఖర్,కనకట్ల వెంకటేశం, నాయకులు పాల్గొన్నారు.

**కొల్చారం మండలంలో..**

**కొల్చారం,మే21,ప్రభాతవార్త:** దేశ అభివృద్ధికి ఆద్యుడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగుల గారి మల్లేష్ గౌడ్ అన్నారు. మంగళవారం నాడు రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిపాలనలో సంస్కరణలు తెచ్చిన నాయకుడు, సౌభ్రాతృత్వం కాపడటానికి తన ప్రాణాన్ని త్యాగం చేసిన మహానియుడు రాజీవ్ గాంధీ అని, కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యంగారి గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి గంగసాని మహేశ్వర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేవన గారి శేఖర్, గ్రామ శాఖ అధ్యక్షులు ఆశన్నగారి శ్రీశైలం, అప్పాజీపల్లి మాజీ సర్పంచి సునిత వెంకట్‌గౌడ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు సయ్యద్, అక్రం పోతిరెడ్డి మాజీ ఎంపీటీసీ రూప్ల, కాంగ్రెస్ నాయకులు సంగప్ప, రవీందర్ నాయక్, మహేష్ గౌడ్, విట్టల్ గౌడ్, ఎన్‌యుఎస్ఐ నాయకులు మహ్మద్ సమీర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**పటాన్‌చెరువులో..**

**పటాన్‌చెరు,మే21,ప్రభాతవార్త:** దేశానికి సాంకేతికతను తిసుకోచ్చి ప్రపంచంలో టెక్నాలజీ విప్లవంలో భారత్‌ను నిలిపింది రాజీవ్‌గాంధినేనని మెదక్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. మంగళవారం నీలం మధు ముదిరాజ్ వర్ధంతిని పురస్కరించుకొని చిట్కుల్‌లోని క్యాంపు కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది, రాజీవ్ గాంధీనే అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారతదేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తు చేశారు.

**నర్సాపూర్‌లో ..**

**నర్సాపూర్ మే, 21. ప్రభాతవార్త :** బారత మాజీ ప్రధాని దివంగత స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం నర్సాపూర్‌నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధనయక్షులు ఆంజనేయులుగౌడ్ తో పాటు కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధనయక్షులు ఆంజజనేయులుగౌడ్ మాట్లాడుతూ భారతదేశ సాంకేతిక అభివృద్ధికి ఆద్యుడని పేర్కొంటు పరిపాలనలో సంస్కరణలు తెచ్చిన నాయకుడని కొనియాడారు.ఈకార్యక్రమంలో ఎంపిపి జ్యోతి సురేశ్ నాయక్, పిఏసిఎస్‌చైర్మన్ రాజుయాదవ్, మాజీ జడ్పిటీసి శ్రీనివాస్‌గుప్త,మాజీ ఎంపిపి లు శ్రీనివాస్‌గౌడ్, లలిత నర్సింగ్ నాయక్,నర్సాపూర్ బ్లాక్ కాంగ్రెస్‌అధ్యక్షులు రిజ్వాన్,మండల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లేషం,పట్టణ వర్కింగ్ ప్రసిడెంట్ రశీద్, నాయకులు రాధాకృష్ణాగౌడ్, హాబీబ్‌ఖాన్, శ్రీశైలంయాదవ్, ఎద్దు మల్లేష్‌యాదవ్, మైనార్టీ మండల సెల్ అధ్యక్షులు అజ్మత్, శివ్వంపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మన్నె శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నర్సింహ్మాచారి, రత్నాపూర్ మహేశ్, యూత్ కాంగ్రెస్ నాయకులు,ఎన్ఎస్‌యుఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలలో స్వచ్ఛ భారత్



తార కళాశాలలో స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న విద్యార్థులు

**సంగారెడ్డి టౌన్, మే 21, ప్రభాతవార్త:**

సంగారెడ్డి పట్టణంలోని తారా ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్, అర్థ శాస్త్ర విభాగ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్న ప్రసాద్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమంతో పరిసరాలను పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అన్ని విభాగాలకు కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తున్నట్లు గుర్తు చేశారు. పరిసరాల పరిశుభ్రతతో అనారొగ్యాలు దరిదాపుల్లోకి రాకుండా ఉంటాయని, ఫలితంగా ప్రజలు ఆరోగ్యంగా ఉండగలుగుతారన్నారు. తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్ డాక్టర్ సిద్దులు, డాక్టర్ అభిజిత్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గడిపెద్దాపూర్‌లో బోనాల సందడి



గడిపెద్దాపూర్‌లో బోనాలను ఊరేగింపుగా తీసుకుపోతున్న భక్తులు

**అల్లాదుర్గం, మే 21, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని గడిపెద్దాపూర్‌లో మంగళవారం బోనాల సందడి నెలకొంది. గ్రామంలోని మల్లికార్జున స్వామికి, గ్రామ దేవత ఎల్లమ్మ తల్లికి బోనాల పండగను భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని మహిళలు తమ ఇండ్ల నుంచి బోనాలతో గ్రామ కూడలికి చేరుకుని సామూహికంగా గ్రామ పురవీధు గుండా ఆలయాల వరకు బోనాలతో ఊరేగింపుగా చేసుకుని స్వామి, అమ్మవార్లకు బోనాలను సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామం గోవింద నామస్మరణతో మారుమ్రోగింది. ఉత్సవాలను తిలకించేందుకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో గడిపెద్దాపూర్‌కు చేరుకోవడంతో గ్రామం సందడిగా మారింది. బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తి శ్రద్దల మధ్య జరిగేలా ఆలయ కమిటి బాధ్యులు తగు చర్యలు తీసుకున్నారు.

## ఆరెపల్లి చెరువు నుండి మట్టి అక్రమ రవాణా

**-అక్రమ రవాణా అడ్డుకోవాలని అధికారులకు ఫిర్యాదు**



ఆరెపల్లి చెరువులో మట్టి తీస్తున్న టిప్పర్ దృశ్యం

**హుస్నాబాద్,మే21,ప్రభాతవార్త**

హుస్నాబాద్ పట్టణంలోని ఆరెపల్లి చెరువు నుండి మట్టి అక్రమంగా తరలిస్తున్నారని బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గ కోఆర్డినేటర్,రైతు ఐక్యత సంఘం నాయకులు పచ్చిమట్ల రవిందర్ ఆరోపించారు.మంగళవారం చెరువు నుండి మట్టి తరలిస్తున్నారని విషయం తెలుసుకుని రైతులతో కలసి చెరువును సందర్శించారు. ఈ సందర్బంగా వారు నీటి పారుదలశాఖతో పాటు తహసీల్ అధికారులకు సమాచారం అందించారు.చెరువు నుండి మట్టిని తరలిస్తున్న టిప్పర్లు,జెసిబిలు ధరణి కన్‌స్ట్రక్షన్స్ వారివని అనుమతులు లేకుండా లక్షల విలువ చేసే మట్టిని తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హుస్నాబాద్ తహసీల్దార్ రవిందర్‌రెడ్డితో పాటు నీటి పారుదలశాఖ డిఈకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## రైతుల సమస్యలపై కాంగ్రెస్‌కు పట్టింపు లేదు

**-బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి**



మాట్లాడుతున్న రాంగోపాల్‌రెడ్డి

**హుస్నాబాద్,మే21,ప్రభాతవార్త**

రాష్ట్రంలోని రైతుల సమస్యల పట్ల కాంగ్రెస్ పార్టీకి పట్టింపు లేదని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఆరోపించారు.మంగళవారం బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ ఆదేశాల మేరకు హుస్నాబాద్‌లోని వెంకటేశ్వర గార్డెన్‌లో రైతు రణభేరి దీక్ష నిర్వహించారు.ఈ సందర్బంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజల ఓట్లు దండుకునేందుకు అనేక హామీలు ఇచ్చిందని అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు.ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా బిజెపి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు.ఎన్నికల ముందు ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు 500 బోనస్‌తో పాటు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్,నాయకులు రాజేంద్రప్రసాద్,మహేందర్‌రెడ్డి,ఖమ్మం వెంకటేశం,శ్రీనివాస్,పృధ్వీరాజ్,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, చందు, లక్ష్మణ్,సమ్మయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా డంప్ చేసిన ఇసుక సీజ్



అక్రమంగా డంప్‌చేసిన ఇసుకను చూపిస్తున్న పోలీసులు

**చేర్యాల (దూల్మిట్ట),మే21,ప్రభాతవార్త**

అక్రమంగా డంప్ చేసి ఉంచిన ఇసుకను మద్దూరు పోలీసులు మంగళవారం సీజ్ చేశారు.మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని జాలపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు ఇసుకను అక్రమంగా డంపు చేశారని పోలీసులకు నమ్మదగిన సమాచారం అందడంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్,మద్దూరు పోలీసులు ఇసుక డంపును పరిశీలించి సీజ్ చేశారు.పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## విద్యార్థులకు అవార్డులు,మెడల్స్ సర్టిఫికెట్స్ అందజేత




విద్యార్థులకు అవార్డులు,మెడల్స్ సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

**చేర్యాల,మే21,ప్రభాతవార్త**

ఇటివల పబ్లిక్ పరీక్షల్లో పదోతరగతి,ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ,ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు చేర్యాలలోని రిలాయన్స్ ట్రెండ్స్ వారి ఆధ్వర్యంలో అవార్డులు, మెడల్స్ సర్టిఫికేట్లు ప్రోత్సహాలను అందించారు.అలాగే విద్యార్థుల తల్లిదండ్రులను,పాఠశాలల ప్రధానోపాధ్యాయుల,కళాశాలల ప్రిన్సిపాళ్ళను ఈ సందర్భంగా సత్కరించారు.

## విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

**-ఏడిఏ బాబునాయక్**



సమావేశంలో మాట్లాడుతున్న ఏడిఏ బాబునాయక్

**గజ్వేల్, మే 21 (ప్రభాతవార్త):**

కల్తీ విత్తనాలు అమ్మినా, డిమాండ్ ఉన్న విత్తనాలను కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు రైతులకు విక్రయించినా డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏడిఏ బాబునాయక్ హెచ్చరించారు. మంగళవారం గజ్వేల్ డివిజన్ పరిధిలోని గజ్వేల్, కొండపాక, రాయపోల్ మండలాలకు చెందిన సీడ్స్, ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్ డీలర్లతో గజ్వేల్ రైతు వేదికలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ బాబునాయక్ మాట్లాడుతూ వానాకాలం పంటలకు సంబంధించిన విత్తనాలు, ఎరువులు ప్రణాళికలు చేసి రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని, విధిగా స్టాక్ బోర్డు, ధరల బోర్డును రైతులకు కనబడే విధంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతులను మోసం చేయాలని ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు పెడతామని డీలర్లను హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఓలు నాగరాజు, ప్రియదర్శినితో పాటు ఏఈఓలు, డీలర్లు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



చిన్నశంకరంపేటలో వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

**చిన్నశంకరంపేట,మే21,ప్రభాతవార్త:**

రైతులు ఆరుగాలం కష్టించి వేలాది రుపాయలు ఖర్చుపెట్టి పంటలు సాగు చేసుకున్నారని, ఆకాల వర్షం కారణంగా నష్టపోయిన రైతులను నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షులు మైసయ్య యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం నాడు మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని త్వరగా తూకం వేయాలన్నారు.ఆకాల వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇప్పటికైన స్పందించి వరి ధాన్యం తూకం వేయించడంతో పాటు తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్‌లకు తరలించాలని ఆయన కోరారు.

## దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన కుటుంబం నెహ్రూ కుటుంబం

**-సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య**



మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య

**హుస్నాబాద్,మే21,ప్రభాతవార్త**

దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన కుటుంబం నెహ్రూ కుటుంబం అని సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య అన్నారు.మంగళవారం రోజున దేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్బంగా పార్టీ శ్రేణులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ దేశం కోసం నెహ్రూ, ఇందిరాగాంధీ,రాంజీవ్‌గాంధీలు దేశం కోసం దేశంలోని ప్రల సంక్షేమ కోసం ఆలోచన చేశారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు బంక చందు, కౌన్సిర్లు వల్లపు రాజు,భూక్య సరోజన,పున్న లావణ్యసది,నాయకులు యాదవరెడ్డి, వెన్నరాజు,బురుగు కిష్టస్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

**అక్కన్నపేటలో :** దేశ మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలు అక్కన్నపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్బంగా పార్టీ శ్రేణులతో కలసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.అనంతరం దేశానికి వారు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చింతల మల్లారెడ్డి,చింతల బాల్‌రాజ్,నర్తిని మునిరాజ్,గుగులోతు రాజు,లింగమూర్తి, అక్బర్,భాస్కర్‌నాయక్,తాజామాజీ సర్పంచ్ బద్దం రాజిరెడ్డి పాల్గొన్నారు.

## సొంత ఖర్చులతో కాలనీల రోడ్లల్లో మొరం వేయించిన కౌన్సిలర్



నర్సాపూర్‌లోని 2 వ వార్డులోగల రోడ్లల్లో స్వంత ఖర్చులతో మొరం వేయిస్తున్న కౌన్సిలర్ లతరమేశ్‌యాదవ్

**నర్సాపూర్ మే, 21. ప్రభాతవార్త :**

నర్సాపూర్ మున్సిఫల్ పరిధిలోని 2 వ వార్డులోని వినాయకనగర్, సునీతారెడ్డి కాలనీలో అకాల వర్షాలకు అంతర్గత రోడ్లన్ని బురదమయం కాగా 2 వ వార్డు కౌన్సిలర్ లతరమేశ్ యాదవ్ స్పందించి వెంటనే తన సొంత ఖర్చులతో ఈ వార్డుల్లోని అంతర్గత రోడ్లలో మొరం వేయించి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు..ఇటీవల కురుసిన వర్షాలకు ఈ కాలనీలోని రోడ్లన్ని బురద మయం కాగా ఈ కాలనీవాసులకు నడవాలంటేనే ఎన్నో ఇబ్బందులు కలిగాయి . ఈమేరకు ఈకాలనీల్లోని రోడ్లన్ని బురదమయంగా మారి కాలనీవాసులు నడవడానికి ఇబ్బందులను చూసిన వార్డు కౌన్సిలర్ లతరమేశ్‌యాదవ్ స్పందించి తన స్వంత డబ్బుల ఖర్చులతో ట్రాక్టర్‌ల తో రోడ్లల్లో మొరం వేయించి చదును చేయించారు.,ఆదేవిదంగా పైప్‌లైన్ చెడిపోయినందున కొత్తగా పైప్‌లైన్ లను కూడ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కాలనీల్లో రోడ్లన్ని బురమయం అయిన రోడ్డల్లో మొరం వేయించడం వల్ల ఈ కాలనీ వాసులకు ఇబ్బందులు తోలిగిపోయాయని వారు. ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక పైప్‌లైన్ వేసినందులకు కూడ తమ హర్షం వ్యక్తం చేస్తున్నారు. వినాయక్‌నగర్, సునీతదారెడ్డి కాలనీ వాసుల ఇబ్బందులు గమనించి వెంటనే సమస్యలను పరిష్కరించినందుకు గాను ఈ కాలనీ వాసులు తమ కౌన్సిలర్ లత రమేశ్‌యాదవ్‌కు ఈ సందర్బంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## గీతంకు సిఎస్ఐఆర్ పరిశోధనా ప్రాజెక్టు

**పటాన్‌చెరు,మే21,ప్రభాతవార్త:** భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన సీఎస్ఐఆర్ గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయానికి రూ.25.42 లక్షల పరిశోధనా గ్రాంటును మంజూరు చేసింది. ఈ విషయాన్ని ఉప కులపతి ప్రొఫెసర్ దయానంద సిద్ద వట్టం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాస్పైర్ పథకం కింద మంజూరు చేసిన ఈ ప్రాజెక్టు ద్వారా కాస్కేడ్ ఉత్ప్రేరకము ద్వారా సహాయ ఎంజైమ్ పునరుత్పత్తితో సమన్వయ ఫోటో-బయోక్యాలిటిక్ హైడ్రోజన్‌ఉత్పత్తి కోసం పరిశోధన చేపట్టనున్నట్లు ఆయన తెలియచేశారు. హైదరబాద్ ప్రాంగణంలోని స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న డాక్టర్ గౌసియా బేగం ఈ ప్రాజెక్టు పరిశోధకురాలిగా వ్యవహరిస్తారన్నారు. సీఎస్ఐఆర్ ప్రాజెక్టును సాధించిన డాక్టర్ గౌసియా బేగంను అభినందిస్తూనే, పరిశోధనా ప్రయత్నం యొక్క ప్రాముఖ్యతను ఎత్తి చూపారు. ఈ ప్రాజెక్టు జ్ఞానాన్ని పెంపోందించడాని క్లిష్టమైన రంగాలలో పరిశోధన నైపుణ్యాన్ని ప్రోత్సహించడంలో గీతం అంకితభావాన్ని నోక్కి చెబుతుందని పేర్కొన్నారు.

## గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు

**నర్సాపూర్ మే, 21. ప్రభాతవార్త :** నర్సాపూర్‌లోని గిరిజన గురుకులంలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లకు 10 వ తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ బిక్షమయ్య తెలిపారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్‌లోని తెలంగాణా రాష్ట్ర గిరిజన గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరానికి ఎంపిసి, బిపిసి,సిఈసి గ్రూపులల్లో మిగిలిన సీట్ల ను భర్తీ చేయడానికి ప్రవేశాలకు 10 వ తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విధ్యార్థులకు ఈ నెల 23 న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2023..2024 సంవత్సరం 10 వ తరగతిలో ఉత్తీర్ణులైన గిరిజన విధ్యార్థులకు అడ్మిషన్‌లు కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట యందు ఈ నెల 23 న ఉదయం 10 గంటలకు నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు హాజరు కావల్సి ఉంటుందని అన్నారు. ఈమేరకు అర్హులైన గిరిజన విధ్యార్థులు ఈ అవకావాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ బిక్షమయ్య తెలిపారు.

## పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



కొండపాక పాఠశాలలో విద్యుత్ సౌకర్యాన్ని పరిశీలిస్తున్న రమేష్

**కొండపాక, మే 21, ప్రభాతవార్త**

పాఠశాలలు పునర్ ప్రారంభించే నాటికి పాఠశాలల్లో జరుగుతున్న మౌళిక వసతుల కల్పన, అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సమగ్ర శిక్ష అదనపు సంచాలకులు గాజర్ల రమేష్ అధికారులకు సూచించారు. మంగళవారం కొండపాక మండల పరిధిలోని కొండపాక, సిర్సనగండ్ల ఉన్నత పాఠశాలల్లో అమ్మ అదర్శ కమిటీల అధ్వర్యంలో జరుగుతున్న పనులను అయన సందర్శించి పరిశీలించారు. అనంతరం అయన మాట్లాడుతూ పనులు నాణ్యతతో ఉండాలన్నారు. పాఠశాలల్లో కనీస వసతులు విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీరు, చిన్నచిన్న మరమత్తు పనుల కోసం నిధులు మంజూరి చేసి పనులు చేపట్టినట్లు తెలిపారు. అధికారులు పనులను పర్యవేక్షణ చేయాలని సూచించారు. అన్ని పనులను తొందరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఒ ఎం. శ్రీనివాస్‌రెడ్డి, అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విఠల్‌నాయక్ పాల్గొన్నారు.

## హనుమన్ దీక్ష స్వాములకు భిక్ష

**కొండపాక, మే 21, ప్రబాతవార్త**

కొండపాక మండల కేంద్రంలో మంగళవారం హనుమన్ దీక్ష ధరించిన స్వాములకు కొత్తబాట హనుమన్ దేవాలయం ప్రాంగణంలో జడ్పీటీసి అనంతుల అశ్విని ప్రశాంత్ బిక్ష (అన్నదానం)కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దీక్ష దారణ చేసిన వారందరు అన్న దాత దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

**కొండపాక, మే 21, ప్రబాతవార్త**

స్వర్గీయ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద అయన చిత్ర పటానికి కొండపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాసరి లింగరావు అధ్వర ంయలో పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కొయ్యడ వెంకటేష్, బట్ట పర్శరాములు, కొమ్ము మల్లికార్జున్, సోషల్ మిడియా కో అర్డినేటర్ మెరుగు ప్రభాస్, పిఏసిఎస్ డైరెక్టర్ సురేందర్, పంజా చిరంజీవి, పెరుగు తిరుపతి, బూరుగుల నరేందర్, సిద్దులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా అంకిరెడ్డిపల్లిలో గ్రామ కమిటీ అధ్వర్యంలో అయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గజ్వేల్ సుదర్శన్, తాళ్లపల్లి అంజయ్య, సంజీవ్, ప్రవీణ్, కిషణ్‌రావు, మల్లేశం, నాగరాజు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.